నిర్భయవార్త
తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA
Digital Editions
www.nirbhayavaartha.in
https://nirbhayavaartha.in

నిర్భయవార్త
తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA TELUGU DAILY



సంపుటి : 13 సంచిక : 185 రంగారెడ్డి | శుక్రవారం 06 నవంబర్ 2026 | ఎడిటర్ : బవనారి రవికుమార్ | 06-11-2026 November | పేజీలు : 8 | వెల : రూ॥ 1-00

Circulated To: Hyderabad-Rangareddy-Nizamabad-Warangal-Mulugu-Yadadri-Nalgonda-Karimnagar-Khammam-Medak-Sangareddy-Siddipet-Medchal-Jagityal-Vemulawada



నేడు కేబినెట్ భేటీ

- రైతు భరోసా, ఎల్‌నినోపై చర్చ
- సాయంత్రం సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సమావేశం
- గ్లోబల్ సమ్మిట్ నిర్వహణ, కరువు సహాయం,
- రేషన్ సరుకుల పంపిణీపై చర్చించే అవకాశం
- కేంద్ర సహాయం కోసం అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లే ఛాన్స్!

నిర్భయవార్త ప్రతినిధి : తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం నేడు కీలక సమావేశం నిర్వహించనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సాయంత్రం సచివాలయంలో కేబినెట్ భేటీ జరగనుంది. రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ, ఆర్థిక, వ్యవసాయ పరిస్థితులతో పాటు పలు కీలక అంశాలపై మంత్రివర్గం చర్చించనుంది. ముఖ్యంగా ఎల్‌నినో ప్రభావంతో వచ్చే వ్యవసాయ సీజన్‌లో ఎదురయ్యే వాతావరణ పరిస్థితులు, రైతులకు అందించాల్సిన సహాయం, కరువు నివారణ చర్యలపై సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. కేబినెట్ సమావేశానికి ముందు ముఖ్యమంత్రి మంత్రులతో అనధికారికంగా సమావేశం కానున్నారు. ఈ భేటీలో ప్రధానంగా చర్చించాల్సిన అంశాలు, ఆయా శాఖల ప్రతిపాదనలు, ప్రభుత్వ ప్రాధాన్యతలపై మంత్రులతో సీఎం అభిప్రాయాలు పంచుకోనున్నారు. అనంతరం అధికారిక కేబినెట్ సమావేశంలో కీలక ప్రతిపాదనలపై చర్చించి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.

గ్లోబల్ సమ్మిట్ నిర్వహణపై సమీక్ష

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026 ప్రధాన అజెండాగా ఉండనుంది. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హ్యూచర్ సిటీలో ఈ అంతర్జాతీయ పెట్టుబడుల సదస్సు నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, వివిధ సంస్థల ప్రతినిధులను ఆహ్వానించి తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించాలని ప్రభుత్వం భావిస్తోంది. సదస్సు నిర్వహణ, మౌలిక వసతులు, పెట్టుబడుల ఆకర్షణ, వివిధ శాఖల సమన్వయం వంటి అంశాలపై కేబినెట్‌లో చర్చించే అవకాశం ఉంది.

ఎల్‌నినోపై సబ్ కమిటీ నివేదిక

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు, భూగర్భ జలాల తగ్గుదల, సాగునీటి సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై మంత్రివర్గం చర్చించనుంది. ఇప్పటికే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలో ఎల్‌నినోపై మంత్రుల సబ్ కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ప్రాథమిక నివేదికను కేబినెట్ ముందు ఉంచే అవకాశం ఉంది. వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు తక్షణం చేపట్టాల్సిన చర్యలు, తాగునీటి సరఫరా, విద్యుత్ సరఫరా, ప్రత్యామ్నాయ పంటల సాగుపై చర్చించనున్నారు.

రైతు భరోసా, కరువు సహాయంపై కీలక చర్చ

రైతు భరోసా పథకం అమలు, రైతులకు అందించాల్సిన ఆర్థిక సహాయం, కరువు పరిస్థితుల్లో వ్యవసాయ రంగాన్ని ఆదుకునే అంశాలు కూడా సమావేశంలో ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే రాష్ట్రంలో 365 మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించిన నేపథ్యంలో కేంద్రం నుంచి రూ.20 వేల కోట్ల ఆర్థిక సహాయం కోరిన అంశంపై కూడా చర్చించనున్నారు. ఉపాధి హామీ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో పనిదినాలను పెంచడం, కూలీలకు ఉపాధి కల్పించడం వంటి అంశాలపైనా ప్రభుత్వం దృష్టి సారించనుంది.

రేషన్ కార్డులపై నిత్యావసర సరుకులు

రేషన్ కార్డుదారులకు ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యావసర సరుకులను అందించే అంశం కూడా కేబినెట్ అజెండాలో ఉండే అవకాశం ఉంది. ప్రస్తుతం బియ్యంతో పాటు ఇతర నిత్యావసర సరుకులను పంపిణీ చేసే ప్రతిపాదనలపై చర్చించనున్నట్లు తెలుస్తోంది. అదేవిధంగా ఉపాధి హామీకి సంబంధించిన వీబీజీ రాంజీ పథకాన్ని పట్టణ ప్రాంతాల్లో అమలు చేసే అవకాశాలపైనా మంత్రివర్గం చర్చించనున్నట్లు సమాచారం.

అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లే అంశంపై నిర్ణయం


ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, వ్యవసాయ రంగానికి ఎదురవుతున్న ఇబ్బందుల నేపథ్యంలో కేంద్రం నుంచి ప్రత్యేక ఆర్థిక సహాయం కోరాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం అఖిలపక్ష ప్రతినిధి బృందాన్ని ఢిల్లీకి తీసుకెళ్లే అంశం మరో కీలక చర్చగా మారనుంది. ముఖ్యమంత్రి నేతృత్వంలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సహా ఇతర కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్ర పరిస్థితులను వివరించాలన్న ప్రతిపాదనపై కేబినెట్ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

మరికొన్ని అంశాలపైనా కసరత్తు

ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, కొత్త అభివృద్ధి ప్రాజెక్టులు, ఉద్యోగ నియామకాలు, బడ్జెట్ కేటాయింపులు, వివిధ శాఖలకు సంబంధించిన ప్రతిపాదనలపై కూడా మంత్రివర్గం సమీక్షించే అవకాశం ఉంది. రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగం భూసేకరణ పరిహారానికి సంబంధించిన రాష్ట్ర వాటా, ఇతర కీలక పరిపాలనా అంశాలు కూడా చర్చకు వచ్చే అవకాశముంది

చర్చ వీధుల్లో కాదు పార్లమెంట్‌లో పెట్టాలి..

రాహుల్‌గాంధీకి అమిత్ షా కౌంటర్



ఢిల్లీ, నిర్భయవార్త ప్రతినిధి : ప్రధాని నరేంద్రమోదీ బహిరంగ చర్చకు రావాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేస్తున్న డిమాండ్‌ను కేంద్ర హోంమంత్రి అమిత్ షా తప్పుపట్టారు. రాజకీయ చర్చను వీధుల్లో పెట్టకూడదని, పార్లమెంట్‌లో పెట్టాలని ఆయన కౌంటర్ వేశారు. ప్రభుత్వం నుంచి వచ్చే సమాధానాలను రాహుల్‌గాంధీ తట్టుకోలేరని ఎద్దేవాచేశారు. బాధ్యతాయుతమైన చర్చ జరగాలని మీరు అనుకుంటే, మీ ఆందోళనల్లో సత్యం, తర్కం ఉంటే రండి పార్లమెంట్‌లో చర్చించుకుందాం అని సవాల్ చేశారు. ఎదురెదురుగా కూర్చుని మాట్లాడుకుందాంగానీ మా సమాధానాలను మీరు తట్టుకోలేరని రాహుల్‌గాంధీని ఉద్దేశించి అన్నారు. ఎప్పటిలాగే ఇప్పుడు కూడా పారిపోతారని ఎద్దేవాచేశారు. పార్లమెంట్ కార్యకలాపాలకు అంతరాయం కలిగించడమే కాంగ్రెస్ పనిగా పెట్టుకుందని విమర్శించారు. బాయ్‌కాట్‌లను రాజకీయ వ్యూహంగా మార్చుకుందని విమర్శించారు. పార్లమెంట్‌లో కీలకమైన చర్చలను తప్పించుకుంటున్నారని, గందరగోళం సృష్టించేందుకు వీధుల్లో జనాలను సమీకరించుకుంటున్నారని హర్యానాలో జరిగిన ఓ సభలో అమిత్ షా మండిపడ్డారు.

తెలంగాణను అంతర్జాతీయ స్థాయి స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం: మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, నిర్భయవార్త ప్రతినిధి :: తెలంగాణను అంతర్జాతీయ స్థాయి స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమని రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. గురువారం గచ్చిబౌలిలో తెలంగాణ ఇండియా ఇంటర్నేషనల్ ఛాలెంజ్ -- 2026 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో అంతర్జాతీయ పోటీలు కొనసాగుతున్నాయి. నవంబరు 3వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొని, ప్రసంగించారు.

మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి

సీఎం రేవంత్ రెడ్డి వినూత్న పిలుపు

- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి వేడుకలు
- పేదల సొంతింటి కల నెరవేరిన వేళ వారితో పండుగ
- ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులకు సీఎం సూచన
- క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లాలని పిలుపు
- పేదల ఇళ్లలో వెలుగులు నింపడమే లక్ష్యంగా కార్యక్రమం



హైదరాబాద్, నిర్భయవార్త ప్రతినిధి : పేదల సొంతింటి కల సాకారమైన వేళ.. వారి ఆనందంలో పాలుపంచుకునేందుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దీపావళి పండుగను ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి జరుపుకోవాలని పిలుపునిచ్చారు. 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' పేరుతో చేపట్టనున్న ఈ కార్యక్రమం ద్వారా పేదల ఇళ్లలో పండుగ వెలుగులు నింపాలని ఆకాంక్షించారు.

ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సొంతింటిని సాకారం చేసుకున్న పేద కుటుంబాలతో ఈ ఏడాది దీపావళి వేడుకల్లో భాగస్వాములు కావాలని సీఎం నిర్ణయించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా తన సందేశాన్ని వెల్లడించారు. పేదల సొంతింటి సంతోషంలో తాను స్వయంగా పాలుపంచుకోనున్నట్లు తెలిపారు. ఇల్లు అనేది ప్రతి పేద కుటుంబానికి ఒక కల అని, ఆ కల నెరవేరిన సందర్భాన్ని పండుగలా జరుపుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి పిలుపునిచ్చారు.

ప్రజాప్రతినిధులు, అధికారులకు సూచనలు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేవలం ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులంతా ఇందులో భాగస్వాములు కావాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లాలని కోరారు. వారి కుటుంబ సభ్యులతో కలిసి దీపావళి వేడుకల్లో పాల్గొని పండుగ శుభాకాంక్షలు తెలియజేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ యంత్రాంగం ప్రజలకు మరింత చేరువ కావాలని, ముఖ్యంగా పేద కుటుంబాల సంతోషాల్లో భాగస్వాములు కావాలని సూచించారు.

పేదల ఇళ్లలో పండుగ వెలుగులు

సాధారణంగా దీపావళి అంటే ప్రతి ఇంట్లో దీపాలు వెలిగించడం, బాణసంచా కాల్చడం, కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడపడం. అయితే ఆర్థిక ఇబ్బందులతో సొంతింటి కలను సాకారం చేసుకోలేని పేద కుటుంబాలకు సొంత ఇల్లు రావడం జీవితంలోనే ప్రత్యేకమైన సందర్భం. అలాంటి కుటుంబాలతో కలిసి పండుగ జరుపుకోవడం ద్వారా వారిలో మరింత ఆనందం నింపవచ్చన్నది ఈ కార్యక్రమం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది.

నిర్భయవార్త

సంపాదకీయం

శుక్రవారం 06 నవంబర్ 2026

ట్రంప్ విధానాలకు నో!

అమెరికా మధ్యంతర ఎన్నికల్లో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ప్రతినిధుల సభతో పాటు సెనేట్‌లోనూ డెమోక్రాట్లు ఆధిక్యం సాధించడం ట్రంప్ ప్రభుత్వంపై ప్రజల్లో పెరిగిన అసంతృప్తికి నిదర్శనం. ట్రంప్ అనుసరించిన ఏకపక్ష దుందుడుకు విధానాల కారణంగా ప్రపంచంలో అమెరికా ప్రతిష్ట ఎన్నడూ లేనంతగా దెబ్బతినడంతో పాటు, నిత్యావసర వస్తువుల ధరలు, జీవన వ్యయం, ఇంధన ధరల భారం అమెరికా కుటుంబాలను కుంగదీశాయి. ఇరాన్‌తో యుద్ధం ఆర్థిక అనిశ్చితిని మరింత పెంచింది. వాణిజ్య సుంకాల విధానం వల్ల ధరలు పెరిగే ప్రమాదం, వలసలపై కఠిన చర్యలతో వలస కుటుంబాల్లో నెలకొన్న భయం, ప్రభుత్వ నిర్ణయాలపై అనిశ్చితి సామాన్యుల జీవితాలను ప్రభావితం చేశాయి. ఏ దేశమైనా ప్రతి ఒక్కరూ కోరుకునేది ఉపాధి భద్రత, మెరుగైన వైద్యం, నాణ్యమైన విద్య, ప్రశాంతమైన భవిష్యత్తు. ట్రంప్ వీటినే విస్మరించారు. అందుకు తగు మూల్యం చెల్లించారు. మొత్తంగా చూస్తే ఈ మధ్యంతర ఎన్నికల ఫలితాల ద్వారా అమెరికన్లు ట్రంపు విధానాలకు నో చెప్పారు. ప్రతి సమస్యకూ ప్రత్యర్థులనో, పొరుగు దేశాలనో బాధ్యులుగా చిత్రించే టక్కుటమార విద్యలను అమెరికన్లు తిప్పికొట్టారు. ఫలితంగా మధ్యంతర ఎన్నికలలో డెమోక్రటిక్ పార్టీ చారిత్రక విజయాన్ని సాధించింది. కాన్సాస్‌లో దాదాపు ఒక శతాబ్దం తర్వాత డెమోక్రటిక్ పార్టీ సెనేట్ స్థానాన్ని గెలుచుకుంది. టెక్సాస్‌లోనూ దశాబ్దాలుగా కొనసాగిన రిపబ్లికన్ల ఆధిపత్యానికి గట్టి దెబ్బ తగిలింది. వాషింగ్టన్ డిసి లో సోషలిస్టు విజయం సాధించడం ఓ ప్రత్యేకత. ఈ ఎన్నికల్లో డెమోక్రాట్ల తరపున భారతీయ అమెరికన్ల విజయాలు అభినందనీయం. ఫ్లోరిడా నుంచి పియా దండియా అమెరికా ప్రతినిధుల సభకు ఎన్నికై చరిత్ర సృష్టించగా, వర్జీనియా నుంచి సుహాస్ సుబ్రమణ్యం తిరిగి ఎన్నికయ్యారు. మేరీల్యాండ్‌లో లెఫ్టినెంట్ గవర్నర్ అరుణా మిల్లర్ కూడా మరోసారి విజయం సాధించారు. భారతీయ మూలాలున్న ప్రజలు అమెరికా రాజకీయ, సామాజిక జీవితంలో సాధిస్తున్న ప్రగతికి ఈ విజయాలు నిదర్శనం. మొత్తం మీద ఈ మధ్యంతర ఎన్నికలలో ఐదుగురు భారతీయ మూలాలున్నవారు కాంగ్రెస్‌కు ఎన్నికైనట్లు సమాచారం. ఇది ఆహ్వానించదగిన పరిణామం. రెండు దేశాల మధ్య సంబంధాల విస్తరణకు వీరి ఎన్నిక దోహద పడే అవకాశం ఉంది. అదే సమయంలో ట్రంప్ మద్దతుతో ఒహాయో గవర్నర్ పదవికి పోటీ చేసిన వివేక్ రామస్వామి డెమోక్రటిక్ అభ్యర్థి అమీ ఆక్టన్ చేతిలో ఓడిపోవడం గమనార్హం. భారతీయ మూలాలున్న నాయకుడిగా వివేక్ రామస్వామికి ఎంతో గుర్తింపు ఉన్నప్పటికీ ట్రంప్‌తో జత కట్టడంతో ఆయన ఓడిపోయారు. న్యూయార్క్ అటార్నీ జనరల్‌గా పోటీ చేసిన సరితా కోమటిరెడ్డిది కూడా ఇదేస్థితి. ట్రంప్ విధానాలపై అమెరికన్ల ఆగ్రహానికి ఇది కూడా కూడా ఒక నిదర్శనం. అయితే, ఈ ఎన్నికల ఫలితాల తరువాత కూడా డెమోక్రాట్ల చేతికి పెద్దగా అధికారాలేమీ రాకపోయినా, ట్రంప్ ప్రభుత్వ విధానాలను పరిశీలించే, ప్రభుత్వ కార్యకలాపాలపై విచారణలు చేపట్టే, కీలక నియామకాలను అడ్డుకునే అవకాశం కొంత మేర పెరుగుతుంది. చట్టాల ఆమోదం, ప్రభుత్వ వ్యయం వంటి అంశాల్లో చర్చలు, రాజీలు తప్పనిసరిగా మారుతాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. బహుశా ఈ కారణంతోనే తన ఆలోచనలు అమలు కాకపోతే తనకున్న ప్రత్యేక అధికారం (వీటో)ను వినియోగించడానికి వెనుకాడనని ట్రంప్ చెప్పారు. భవిష్యత్‌లో చోటుచేసుకునే పరిణామాలకు ఆయన మాటలను సంకేతాలుగా భావించవచ్చు. అమెరికా ఫలితాలను ప్రపంచవ్యాప్తంగా వ్యక్తమవుతున్న ఈ తరహా ధోరణులలో భాగంగానే చూడాలి. బ్రిటన్‌లో అధికార మార్పు నుండి నిన్నమొన్నటి సెర్బియా విద్యార్థుల ఉద్యమం వరకు అధికారంలో ఉన్న వారి అహంకారానికి ప్రజలు బుద్ధి చెప్పిన ఉదాహరణలు ఎన్నో! దేశాలు, పరిస్థితులు వేర్వేరైనా, ప్రజల జీవన సమస్యలను విస్మరించి అధికారమే పరమావధిగా వ్యవహరించే పాలకులకు ఎదురుదెబ్బ తప్పదనే సందేశం దీనిలో స్పష్టంగా ఉంది. మన దేశంలోనూ 2024 ఎన్నికల్లో బిజెపి సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే మెజార్టీని కోల్పోయింది. ఆ తరువాత కూడా నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్, మతోన్మాద విధానాలను అమలు చేస్తూ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటుండటంతో యువత పెద్ద ఎత్తున రోడ్లమీదకు రావాల్సి వచ్చింది. అమెరికాలో కూడా ట్రంప్ విధానాలపై అసంతృప్తితో ఓటేసిన ప్రజలు, ప్రత్యామ్నాయంగా ముందుకొచ్చే పార్టీ నుంచి కూడా స్పష్టమైన పరిష్కారాలను ఆశిస్తారు. ఇరాన్‌తో యుద్ధం ముగింపుతో పాటు ధరల నియంత్రణ, ఉద్యోగాల కల్పన, వైద్య ఖర్చుల తగ్గింపు, వలసదారుల హక్కులకు గౌరవం, సామాజిక భద్రత, ప్రజాస్వామ్య సంస్థల స్వతంత్రత వంటి అంశాలలో డెమోక్రాట్ల కార్యాచరణను వారు పరిశీలిస్తారు. అందువల్ల ఈ ఫలితాలు వారికి నిజమైన పరీక్షగా మారనున్నాయి. ట్రంప్ విధానాల కారణంగా ఎదుర్కున్న సమస్యలకు విశ్వసనీయమైన ప్రత్యామ్నాయాలను, మార్గాలను చూపాల్సిన బాధ్యత డెమోక్రాట్లపై ఉంది.

నివాస హక్కు - నగరంపై హక్కు



నగరంలో పని ఉంది, కానీ నివసించడానికి చోటు లేదు. ఇల్లు ఉంది, కానీ అద్దె చెల్లించడం కష్టం. అంతేకాదు, చాలా మంది ఏ క్షణంలోనైనా ప్రాణాలు కోల్పోయేంత అభద్రతా భావంతో కూడిన ఆశ్రయంలో రోజులు గడుపుతున్నారు. ఈ వైరుధ్యం నేటి పట్టణ జీవితంలోని ఒక తీవ్రమైన సంక్షోభం. భూమి, ఇల్లు అనేవి ప్రాథమిక మానవ అవసరాలు. కానీ అదే సమయంలో అవి పెట్టుబడి, లాభాల రంగాలు కూడా. దాంతో, గృహ వసతి సమస్య కేవలం పేదలకు మాత్రమే కాదు. ఇది శ్రామిక ప్రజల జీవితాలు, మధ్యతరగతి వారి ఆర్థిక భద్రత, నగర భవిష్యత్తుకు సంబంధించిన ఒక రాజకీయ ప్రశ్న. బెంగళూరు, ముంబై, ఢిల్లీ వంటి నగరాల్లో ఉపాధి పెరిగినప్పటికీ, సరసమైన అద్దెకు లభించే ఇళ్ల కొరత స్పష్టంగా కనిపిస్తోంది. కాయకష్టం మీద ఆధారపడిన అనేక వర్గాలు నగరంలో నివసించే అవకాశాన్ని కోల్పోతున్నాయి. అందువల్ల గృహ వసతిని కేవలం నిర్మాణ పరిశ్రమకు, ప్రైవేట్ ఆస్తికి సంబంధించిన విషయంగా మాత్రమే చూడకూడదు. అసలు ప్రశ్న ఏమిటంటే, నగరంలోని భూమి, వనరులను ఎవరి అవసరాల కోసం ఉపయోగిస్తారు? అభివృద్ధి వల్ల ఎవరు ప్రయోజనం పొందుతారు? పురపాలక సంఘం కేవలం రోడ్లు, విద్యుత్ దీపాలు, మురుగునీటి పారుదల, వ్యర్థాల నిర్వహణకు మాత్రమే బాధ్యత వహిస్తుందా? లేక సురక్షితమైన, సరసమైన గృహ వసతి అవకాశాలను కల్పించడంలో కూడా పాత్ర పోషిస్తుందా? **ప్రపంచ రాజకీయాలలో గృహ వసతి** గృహ సంక్షోభం అంతర్జాతీయ రాజకీయాలలో కూడా ప్రాముఖ్యతను సంతరించుకుంది. 2025 న్యూయార్క్ మేయర్ ఎన్నికలలో, అద్దెలను నియంత్రించడం, సరసమైన గృహాలను నిర్మించడం, జీవన వ్యయాన్ని తగ్గించడం వంటి జోహ్రాన్ మమ్దానీ ప్రచార వాగ్దానాలు ప్రత్యేకంగా ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. ఆయన ప్రచారం ఒక ప్రాథమిక ప్రశ్నను లేవనెత్తింది– నగరంలోని శ్రామిక ప్రజలు ఇకపై ఆ నగరంలో నివసించలేని స్థితిలో ఉంటే, మరి ఆ నగర అభివృద్ధి ఎవరి కోసం? అభివృద్ధికి ప్రధాన లక్ష్యం ఆస్తి మార్కెట్‌లో పెట్టుబడి, లాభాలను పెంచుకోవడమా? లేక సామాన్య ప్రజల నివాస భద్రత కూడా అంతే ముఖ్యమైనదా? లండన్, బెర్లిన్‌తో సహా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రధాన నగరాల్లో, పెరుగుతున్న అద్దెలు, భూమి ధరలు తక్కువ–మధ్య ఆదాయ వర్గాల ప్రజలను నగర కేంద్రం నుండి దూరం చేస్తున్నాయి. సాపేక్షంగా చవకైన నివాస ప్రాంతాలలో కొత్త పెట్టుబడులతో వాణిజ్య కేంద్రాలు, విలాసవంతమైన గృహాలు నిర్మించినప్పుడు, భూమి–ఇళ్ల ధరలు పెరుగుతాయి. అయితే పాత నివాసితులు అక్కడ ఉండటం కష్టమవుతుంది. ఈ ప్రక్రియ ఎప్పుడూ ఖాళీ చేయమనే నోటీసులతో ప్రారంభం కాదు. అద్దెల పెంపు, ఒప్పందాలను పునరుద్ధరించకపోవడం, చిన్న దుకాణాల అద్దెల పెరుగుదల కూడా ప్రజలను స్థానభ్రంశం చేస్తాయి. ఫలితంగా, కష్ట జీవులు తమ పని ప్రాంతాలు, కార్యాలయాల నుండి దూరంగా వెళ్లవలసి వస్తుంది. దీనివల్ల ప్రయాణ ఖర్చులు, రవాణా సమయం పెరుగుతాయి. కొత్త నిర్మాణాలు ఖచ్చితంగా అవసరం. కానీ ఆ నిర్మాణం అందుబాటు ధరల్లో లభించే గృహాలను తగ్గిస్తే, అభివృద్ధి ప్రయోజనాలు ప్రధానంగా భూస్వాములు, పెట్టుబడిదారుల చేతుల్లోనే కేంద్రీకృతమైతే, అది సామాజిక అసమానతను పెంచుతుంది. అందువల్ల, చాలా కాలంగా అక్కడ నివసిస్తున్న వారి హక్కులను పరిరక్షించే అంశాన్ని కూడా పట్టణాభివృద్ధిలో చేర్చాలి. **భారతీయ నగరాలు: అభివృద్ధి ఎవరి కోసం?** బెంగళూరులో సమాచార సాంకేతికత, సేవా పరిశ్రమల విస్తరణ ఉపాధిని పెంచింది. కానీ నిర్మాణ కార్మికులు, గృహ కార్మికులు, సెక్యూరిటీ గార్డులు, తక్కువ వేతన కార్మికులకు అందుబాటు ధరల్లో ఇళ్లు దొరకడం సమస్యగా ఉంది. ముంబైలో మురికివాడల పునరావాస ప్రాజెక్టులలో ప్రైవేట్ నిర్మాణ సంస్థలు పాలుపంచుకున్నప్పటికీ, ప్రాజెక్టు విజయాన్ని కేవలం నిర్మించిన ఇళ్ల సంఖ్యతో మాత్రమే అంచనా వేయలేం. కొత్త ఇళ్ల నాణ్యత, పని ప్రదేశానికి వాటి దూరం, జీవనోపాధిపై వాటి ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. నగర శివార్లలో పునరావాసం కల్పించడం వల్ల ప్రయాణ ఖర్చులు, సమయం పెరుగుతాయని ఢిల్లీ అనుభవం కూడా చెప్తుంది. అందువల్ల, సాధ్యమైన చోట, పాత నివాస ప్రాంతాలలో నీరు, మురుగునీటి పారుదల, మరుగుదొడ్లు, ఇతర సేవలను మెరుగుపరచడం అవసరం. భారతదేశంలో, జాతీయ మురికివాడల అభివృద్ధి కార్యక్రమం, వాల్మీకి అంబేద్కర్ ఆవాస్ యోజన, జెఎన్ఎన్‌యుఆర్ఎం వంటివి ప్రభుత్వ విధానాలలో పట్టణ పేదల గృహ వసతి, ప్రాథమిక సేవల సమస్యకు ప్రాధాన్యతనిచ్చాయి. ఆ తర్వాత, పట్టణ ప్రాంతాలలో రాజీవ్ ఆవాస్ యోజన, ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన కూడా గృహ వసతి అవకాశాలను పెంచడానికి చొరవ తీసుకున్నాయి. కానీ చాలా సందర్భాలలో, ఇళ్ల నిర్మాణమే ప్రధాన లక్ష్యంగా మారింది. సేవల కొరత, ప్రాజెక్టులలో జాప్యం, పని ప్రదేశానికి దూరంగా పునరావాసం కల్పించడం వంటివి వాస్తవ ప్రయోజనాలను పరిమితం చేశాయి. అందువల్ల గృహ నిర్మాణ ప్రాజెక్టుల విజయాన్ని ఇళ్ల సంఖ్య ఆధారంగా కాకుండా... ఇళ్లు కట్టిన ప్రదేశం, సేవల నాణ్యత, రుణ భారం, జీవనోపాధులతో అనుసంధానం ఆధారంగా అంచనా వేయాలని ఈ అనుభవం రుజువు చేస్తుంది. కేరళ 'లైఫ్ మిషన్' నుండి కూడా పాఠాలు నేర్చుకోవచ్చు. నిరాశ్రయులైన, భూమి లేని కుటుంబాలకు గృహ వసతి కల్పించడం, ఇళ్ల నిర్మాణం, వివిధ ప్రాజెక్టుల సమన్వయం కోసం ప్రభుత్వ సహాయం ఈ కార్యక్రమం ముఖ్యమైన అంశాలు. ప్రభుత్వ భూమి, ఉపయోగించని భవనాలు, అనువైన పాడుబడిన పారిశ్రామిక ప్రాంతాలను సర్వే చేసి, సరసమైన అద్దె ఇళ్లు, సహకార గృహాల కోసం భూమిని గుర్తించవచ్చు. అయితే, పర్యావరణం, మురుగునీటి పారుదల, కమ్యూనికేషన్ల అనుకూలతను తనిఖీ చేయడం ముఖ్యం. **వ్రత్యామ్నాయ గృహ నిర్మాణం** గృహ నిర్మాణ ప్రణాళికలో నివాసితులను నేరుగా భాగస్వాములను చేయడం సాధ్యమేనని థాయ్‌లాండ్ బాన్ మాంకాంగ్ కార్యక్రమం నిరూపించింది. కొన్ని సందర్భాల్లో, సహకార సంఘాలు, సామూహిక పొదుపు, ప్రభుత్వ సహాయం ద్వారా పాత నివాస ప్రాంతాలలో సేవలు మెరుగుపరుస్తుండగా, మరికొన్నింటిలో కొత్త గృహాలు నిర్మించబడుతున్నాయి. సహకార సంఘాలను ఏర్పాటు చేయడం ద్వారా, తక్కువ ఆదాయం గల నివాస ప్రాంతాల నివాసితులకు ఇళ్ల మరమ్మతులు, సేవల మెరుగుదల, కొత్త ఇళ్ల నిర్మాణం కోసం తక్కువ వడ్డీకి రుణాలు ఏర్పాటు చేయవచ్చు. కుటుంబ ఆదాయానికి అనుగుణంగా రుణ వాయిదాలను దశలవారీగా పెంచే విధానాన్ని కూడా ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టవచ్చు. అయితే, వడ్డీ రేటు, రుణ మొత్తం ఖర్చు, ఆదాయం పెరగనప్పుడు వాయిదాలను పునఃప్రణాళిక చేయడానికి సంబంధించిన నియమాలు స్పష్టంగా ఉండాలి. అదే సమయంలో, ఇంటి కొనుగోలు రుణం కాకుండా, సరసమైన అద్దె గృహాల కోసం ప్రత్యేక నిధులు అవసరం. చాలా మంది వలస కార్మికులు, గృహ కార్మికులు, తాత్కాలిక కార్మికులు ఇల్లు కొనుగోలు చేయలేరు. వారికి పారదర్శకమైన అద్దె ఒప్పందాలు ఉండటం, అన్యాయమైన తొలగింపులను నివారించడం, సురక్షితమైన అద్దె గృహాలను నిర్ధారించడం చాలా ముఖ్యం. గిగ్ వర్కర్లు, యాప్ ఆధారిత ఆహార విక్రేతలు, కారు, బైక్ డ్రైవర్లు, ఇతర గిగ్ వర్కర్ల సంఖ్య పెరుగుతోంది. వారికి స్థిరమైన పని ప్రదేశం, క్రమమైన ఆదాయం ఉండదు. ఫలితంగా, పని ప్రదేశానికి దగ్గరగా అద్దె చెల్లించడం కష్టమవుతుంది. కానీ అది దూరంగా ఉంటే రాకపోకలకు సమయం, డబ్బు ఖర్చవుతుంది. వారి కోసం, ఉపాధి కేంద్రాలు, మార్కెట్లు, ఆసుపత్రులు, రవాణా కేంద్రాలకు సమీపంలో అందుబాటు ధరలలో చిన్న ఇళ్లు, భాగస్వామ్య గృహాలను నిర్మించవచ్చు. నెలవారీ అద్దెతో పాటు, వారపు లేదా స్వల్పకాలిక గృహ వసతి ఏర్పాట్లు కూడా ఉండాలి. గృహాలలో మరుగుదొడ్లు, సురక్షితమైన తాగునీరు, వంట సౌకర్యాలు, తగినంత గాలి వెలుతురు, అగ్నిమాపక భద్రత తప్పనిసరిగా ఉండేలా చూడాలి. బైక్ పార్కింగ్, ఎలక్ట్రిక్ వాహన చార్జింగ్, మొబైల్ చార్జింగ్, విశ్రాంతి ప్రదేశాలు కూడా అవసరం. మహిళా గిగ్ వర్కర్ల భద్రత కోసం ప్రత్యేక ఏర్పాట్లు అవసరం. ప్రభుత్వ సబ్సిడీలు, మున్సిపల్ భూమి, కార్మికుల సంక్షేమ నిధులు, సహకార సంఘాల పొదుపులను కలిపి పైలట్ ప్రాజెక్టులను నిర్వహించవచ్చు. **ఇంటి హక్కు: మున్సిపల్ రాజకీయ కార్యక్రమం** ప్రతి మున్సిపల్ ప్రాంతంలో గృహ సర్వేతో ఒక సమర్థవంతమైన కార్యక్రమాన్ని ప్రారంభించాలి. ఎన్ని కుటుంబాలు సురక్షితం కాని ఇళ్లలో నివసిస్తున్నాయి, ఎన్ని కుటుంబాలు తమ ఆదాయానికి మించి అద్దె చెల్లిస్తున్నాయి, ఎక్కడ తొలగింపు ప్రమాదం ఉంది అనే సమాచారాన్ని ప్రచురించాలి. ప్రభుత్వ భూములు, ఉపయోగించని భవనాల జాబితాను తయారు చేసి, సరసమైన గృహాలు, సహకార గృహాలు, పునరావాసం కోసం ప్రణాళికలు రూపొందించాలి. సాధ్యమైన చోట, ఇప్పటికే ఉన్న నివాస ప్రాంతాలలో సేవలను మెరుగుపరచాలి. పురపాలక ఎన్నికలలో, రాజకీయ పార్టీలను కొన్ని స్పష్టమైన ప్రశ్నలు అడగాలి–ప్రభుత్వ భూముల జాబితాను ప్రచురిస్తారా? సరసమైన గృహాల కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయిస్తారా? గృహ నివాస సమస్యలను ఎదుర్కొంటున్న కుటుంబాలకు న్యాయ సహాయం, పునరావాసం అందుతాయా? గిగ్ వర్కర్ల కోసం పని ప్రదేశానికి సమీపంలో గృహాలు, విశ్రాంతి కేంద్రాలు నిర్మిస్తారా? గృహ నిర్మాణ ప్రాజెక్టులకు నిధులు, వాటి అమలు వివరాలను క్రమం తప్పకుండా ప్రచురిస్తారా? కార్మిక సంఘాలు, మహిళా సంఘాలు, గిగ్ వర్కర్ల సంఘాలు, పౌర సమూహాలతో కలిసి ఇంటి డిమాండ్ లేఖను తయారు చేయవచ్చు. ఇంటి హక్కు అనేది కేవలం ఇల్లు కట్టుకోవడానికి సంబంధించిన విషయం మాత్రమే కాదు. భూ వినియోగం, అందుబాటు ధరలో అద్దె, దీర్ఘకాలిక రుణాలు, ప్రభుత్వ సహాయం, సహకార సంఘాలు, నివాస ప్రాంతంలోనే సేవల అభివృద్ధి, తొలగింపు నుండి చట్టపరమైన రక్షణ–వీటన్నింటినీ కలిపి పరిగణించాలి. రాష్ట్రాలు సొంత గృహ నిర్మాణ విధానాన్ని రూపొందించుకోవాలి. పని చేసుకునే హక్కు ఉన్న నగరంలో, సురక్షితంగా జీవించే అవకాశం కూడా ఉండాలి. అందువల్ల, గృహ నిర్మాణం అనేది కేవలం ఒక ఇంటికి సంబంధించిన ప్రశ్న కాదు; అది ఒక న్యాయమైన, ప్రజాస్వామ్యయుతమైన, నివాసయోగ్యమైన నగరాన్ని నిర్మించే ప్రశ్న. చివరిగా, ఒక ప్రశ్న–ఈ నగరం ఎవరిది? నగరంలోని భూమి, ఇళ్లు, వనరులు ఎవరి ప్రయోజనాల కోసం ఉపయోగించబడుతున్నాయి? దీన్నిబట్టే ఆ ప్రశ్నకు సమాధానం నిర్ణయించబడుతుంది.

వరదల్లో చిక్కుకున్న వారికి భరోసా..
రక్షణ చర్యలపై మంత్రి ప్రశంసలు

రాత్రంతా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్..
సహాయక బృందాలకు మంత్రి అభినందనలు



ఖమ్మం/సత్తుపల్లి నవంబర్ 5 నిర్భయవార్త రిపోర్టర్. సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని బేతుపల్లిలో చోటుచేసుకున్న వరద ఘటన నేపథ్యంలో బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చేపట్టిన సహాయక చర్యలను రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభినందించారు. ప్రకృతి విపత్తు సమయంలో ప్రాణాలను



వణంగా పెట్టి బాధితులను రక్షించేందుకు కృషి చేసిన రెస్క్యూ బృందాల సేవలను ప్రశంసించారు.వరద పరిస్థితులపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ, సహాయక చర్యలను వేగవంతం చేయడంలో ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎన్. కీలకంగా వ్యవహరించారని మంత్రి కొనియాడారు. జిల్లా కలెక్టర్ రాత్రంతా పూర్తిస్థాయిలో పరిస్థితులను పర్యవేక్షిస్తూ, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ బాధితులను రక్షించేందుకు చర్యలు చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు.వరద ముప్పు పొంచి ఉన్న ప్రాంతాల్లో సహాయక బృందాలు సమయస్ఫూర్తితో స్పందించి బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించడం ప్రశంసనీయమన్నారు. విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు అండగా నిలిచి, ప్రాణరక్షణకు ప్రాధాన్యతనిచ్చిన ప్రతి ఒక్కరికీ మంత్రి అభినందనలు తెలిపారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, బాధితులకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని మంత్రి సూచించారు. ఆపద సమయంలో ప్రభుత్వ యంత్రాంగం, రెస్క్యూ బృందాలు సమన్వయంతో పనిచేయడం వల్లే సహాయక చర్యలు సమర్థవంతంగా కొనసాగాయని పేర్కొన్నారు.

వరద విపత్తుపై అధికారుల సమన్వయ చర్యలు అభినందనీయం.

ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాల సాహసోపేత సేవలు భేష్
ప్రాణనష్టం లేకుండా బాధితుల రక్షణ.. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి




ఖమ్మం/సత్తుపల్లి, నవంబర్ 5 నిర్భయవార్త. వరద విపత్తు సమయంలో అధికారులు, పోలీసు యంత్రాంగం, ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సమన్వయంతో చేపట్టిన సహాయక చర్యలు అభినందనీయమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రాణాలకు తెగించి వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించి ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా చూడటం గొప్ప విషయమని కొనియాడారు. గురువారం సింగరేణి కాలరీస్ గెస్ట్‌హౌస్‌లో బేతుపల్లి వరద సహాయక చర్యలు, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వరదల వల్ల జరిగిన నష్టాలపై ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లు, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తదితరులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బేతుపల్లి చెరువులో వరద ఉధృతికి చిక్కుకున్న ఎనిమిది మంది మత్స్యకారులను, సహాయక చర్యల్లో పాల్గొన్న సిబ్బందిని సురక్షితంగా రక్షించడం అధికారుల సమన్వయానికి నిదర్శనమన్నారు. గతంలో మున్నేరు వరదల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవతో ఎస్డీఆర్ఎఫ్ వ్యవస్థను పటిష్టం చేశారని తెలిపారు. పోలీసు, అగ్నిమాపక శాఖల నుంచి 1,900 మంది సిబ్బందిని ఎంపిక చేసి శిక్షణ ఇవ్వడంతో పాటు సుమారు రూ.260 కోట్లతో అత్యాధునిక పరికరాలను సమకూర్చినట్లు వివరించారు. ఫలితంగా విపత్తు సంభవించినప్పుడు వేగంగా స్పందించి ప్రాణాలను కాపాడగలుగుతున్నామని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. మాట్లాడుతూ.. బేతుపల్లి చెరువులో చిక్కుకున్న మత్స్యకారుల రక్షణ కోసం జిల్లా యంత్రాంగం, ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు నిరంతరం శ్రమించాయని తెలిపారు. రాత్రంతా కొనసాగిన సహాయక చర్యల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, మొబైల్ లొకేషన్ ట్రేసింగ్ సహాయంతో అందరినీ సురక్షితంగా బయటకు తీసుకువచ్చినట్లు వివరించారు.అదేవిధంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ భారీ వర్షాలు, వరదల్లో చిక్కుకున్న మహిళ, యువకుడు, 11 మంది గిరిజనులను ఎస్డీఆర్ఎఫ్ బృందాలు రక్షించినట్లు కలెక్టర్ అంకిత్ వివరించారు. వరదల కారణంగా దెబ్బతిన్న పంటలు, రహదారులు, చెరువులు, ఇతర మౌలిక సదుపాయాల నష్టాన్ని సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి రెండు మూడు రోజుల్లో సమగ్ర నివేదికలు సమర్పించాలని మంత్రి ఆదేశించారు. నిజంగా నష్టపోయిన రైతులను గుర్తించి నివేదికలు రూపొందించాలని సూచించారు.వరద సహాయక చర్యల్లో గత 36 గంటలుగా విశేషంగా శ్రమించిన ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని మంత్రి



ప్రత్యేకంగా అభినందించారు. ఇళ్లు లేని అర్హులైన రెస్క్యూ సిబ్బందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. సమీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యేలు,జిల్లా కలెక్టర్లు, పోలీసు అధికారులు సైతం సహాయక బృందాల సేవలను అభినందించారు. ఈ సమావేశంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం అదనపు కలెక్టర్ వేణుగోపాల్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బీజేపీ కిసాన్ మోర్చా సింగరేణి మండల అధ్యక్షుడిగా అజ్మీర బిక్ష నాయక్

నియామక పత్రం అందజేసిన జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు నరకుల వెంకటేశ్వర్లు



కారేపల్లి, నవంబర్ 5 నిర్భయవార్త రిపోర్టర్. భారతీయ జనతా పార్టీ అనుబంధ విభాగమైన కిసాన్ మోర్చా సింగరేణి మండల అధ్యక్షుడిగా అజ్మీర బిక్ష నాయక్ నియమితులయ్యారు. గురువారం కారేపల్లి మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు మేకల మల్లేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఈ నియామకాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు నరకుల వెంకటేశ్వర్లు అజ్మీర బిక్ష నాయక్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన అజ్మీర బిక్ష నాయక్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో కిసాన్ మోర్చా మండల అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన జిల్లా, మండల పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారానికి, కేంద్ర ప్రభుత్వ రైతు సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించేందుకు కృషి చేస్తానన్నారు. పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తల సమన్వయంతో ముందుకు సాగుతానని తెలిపారు.ఈ నియామకం పట్ల పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ అజ్మీర బిక్ష నాయక్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు నరుకుల వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షులు మేకల మల్లేష్ యాదవ్, బిజెపి పార్టీ సీనియర్ నాయకులు తురక నారాయణ, మండల నాయకులు మోహన్ సింగ్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంపై మద్యం మత్తులో దుండగుడి దాడి!

ఘటనపై విచారణ చేపట్టిన సీడీపీఓ ఉమా.. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు



కామేపల్లి, నవంబర్ 5 (ఖమ్మం జిల్లా స్టాఫ్ రిపోర్టర్) ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం రామకృష్ణాపురం గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్వాడీ కేంద్రంపై మద్యం మత్తులో ఓ వ్యక్తి దాడికి పాల్పడిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. చిన్నారులకు విద్యాబోధన, పౌష్టికాహారం అందించాల్సిన అంగన్వాడీ కేంద్రంపై దాడి జరగడం పట్ల స్థానికంగా ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ ఘటనపై స్పందించిన సీడీపీఓ కె. ఉమా అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. ఘటనకు సంబంధించిన వివరాలను సేకరించారు. ఘటనపై అంగన్వాడి టీచర్ బాధితుని చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆమె వెల్లడించారు.ప్రజలకు సేవలందించే అంగన్వాడీ కేంద్రాల భద్రతపై ఇలాంటి ఘటనలు ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ప్రభుత్వ విద్యా, సంక్షేమ కేంద్రాలపై దాడులకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.మరి ఈ ఘటనపై పోలీస్ శాఖ ఎలాంటి చర్యలు తీసుకుంటుంది? బాధ్యులపై చట్టపరంగా స్పందిస్తుందా? అన్నది వేచి చూడాల్సి ఉంది.

అమరవీరుల ఆశయ సాధనకై పోరాడుదాం

ప్రజా పోరాటాల్లో భాగస్వాములైనప్పుడే అమరులకు నిజమైన నివాళి.
సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కారేపల్లి మండల కార్యదర్శి వై. ప్రకాష్



కారేపల్లి, నవంబర్ 5 నిర్భయ వార్త రిపోర్టర్. అమరవీరుల ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ ప్రజా పోరాటాల్లో భాగస్వాములు కావాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కారేపల్లి మండల కార్యదర్శి వై. ప్రకాష్ పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 1 నుంచి 9వ తేదీ వరకు నిర్వహిస్తున్న అమరవీరుల వర్ధంతి సంతాప సభల్లో భాగంగా గురువారం కారేపల్లి మండలం పేరుపల్లి గ్రామంలో అమరవీరుల సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలో అమరులైన కామ్రేడ్ పెద్దబోయిన వెంకన్న స్థూపంపై పార్టీ జెండాను ఎగురవేసి ఘనంగా నివాళులర్పించారు. భూమి కోసం, భుక్తి కోసం, ఈ దేశ విముక్తి కోసం పోరాడి అమరులైన కామ్రేడ్లు బిక్కుమియ, హనుమంతరావు, బోళ్ల లింగన్న, పానుగంటి లక్ష్మారెడ్డి, మల్కం చంద్రయ్య, కొప్పుల గురుస్వామి, దినసరి సమ్మన్న, ముదిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కోరం పొట్టయ్య, సంఘ రాములు తదితర అమరవీరులకు జోహార్లు అర్పించారు.అనంతరం వై. ప్రకాష్ మాట్లాడుతూ.. బూర్జువా, భూస్వామ్య దోపిడీ వ్యవస్థలకు, ప్రజావ్యతిరేక పాలకవర్గ విధానాలకు వ్యతిరేకంగా దున్నేవారికి భూమి కావాలని, కార్మిక రాజ్య స్థాపనే లక్ష్యంగా పోరాటాలు సాగాయని తెలిపారు. దోపిడీ, పీడన, అసమానతలు లేని నూతన ప్రజాస్వామిక విప్లవ సాధన కోసం 1969 నుంచి గోదావరి లోయ ప్రతిఘటన పోరాటం కొనసాగిందని పేర్కొన్నారు.ఈ పోరాటాల క్రమంలో సంద్ర పుల్లారెడ్డి, తరిమెల నాగిరెడ్డి, పోట్ల రామనరసయ్య, నీలం రామచంద్రయ్య, గడ్డం వెంకట్రామయ్య, రాయల రవన్న, బత్తుల వెంకటేశ్వరరావు, కోటన్న, బాటన్న, ఎల్లన్న, లింగన్న, కాచనపల్లి అమరవీరులు, కామ్రేడ్ నంబూరి సీతారామరావు, పరశురాములు, సుసేన, చింతా లక్ష్మి తదితరులతో పాటు నాటి నుంచి నేటి వరకు సుమారు 15 వేల మంది వీరులు, వీరవనితలు తమ అమూల్యమైన ప్రాణాలను అర్పించారని వివరించారు.అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడమే కాకుండా వారు ఆశించిన సమాజ స్థాపన కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా పోరాటాల్లో భాగస్వాములు కావాలని అన్నారు. అమరవీరుల ఆశయాల బాటలో నడుస్తూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. వారి ఆశయాలను ఆచరణలో ముందుకు తీసుకెళ్లడమే వారికి మనం అందించే నిజమైన నివాళి అని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మండల నాయకులు కంచర్ల శ్రీనివాస్ రెడ్డి, ఆలంల గురవయ్య, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి వై. జానకి, సుగుణ, చంద్రయ్య, వెంకన్న, సంపత్, కిషన్, రాందాస్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కారేపల్లి పశువుల సంత వేలంలో భారీ పెరుగుదల!

గతేడాది కంటే రూ.1.43 లక్షలు అధికం.. రూ.8.06 లక్షలకు వేలం పాట కైవసం. ఒక ఏడాది నిర్వహణ లైసెన్స్ దక్కించుకున్న దూదిమెట్ల వెంకటేశ్వర్లు



కారేపల్లి, నవంబర్ 5 నిర్భయ వార్త రిపోర్టర్ కారేపల్లి గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ప్రతి వారం నిర్వహించే పశువుల సంత వేలంపాటలో ఈ ఏడాది గణనీయమైన పెరుగుదల నమోదైంది. గురువారం దేవస్థానం ప్రాంగణంలో దేవాదాయ శాఖ ఖమ్మం డివిజన్ పరిశీలకులు ఆర్. సమంత పర్యవేక్షణలో నిర్వహించిన వేలంపాటలో రూ.8 లక్షల 6 వేల ధర పలికింది. గత ఏడాది రూ.6 లక్షల 63 వేలతో పోలిస్తే ఈసారి రూ.1 లక్షా 43 వేల అధిక ఆదాయం సమకూరింది. మార్కెట్‌పల్లికి చెందిన దూదిమెట్ల వెంకటేశ్వర్లు, తండ్రి నరసింహ ఈ వేలంపాటను దక్కించుకున్నారు. ఒక సంవత్సరం కాలపరిమితికి పశువుల సంత నిర్వహణ లైసెన్స్‌ను ఆయన కైవసం చేసుకున్నారు.ఈ సందర్భంగా వేలంపాటలో విజయం సాధించిన దూదిమెట్ల వెంకటేశ్వర్లును కారేపల్లి గ్రామ సర్పంచ్ టోనీ ఘనంగా సత్కరించి అభినందించారు. గత ఏడాదితో పోలిస్తే వేలం ఆదాయం పెరగడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. దేవస్థానానికి ఆదాయం పెరగడంతో పాటు పశువుల సంత నిర్వహణ సక్రమంగా కొనసాగాలని స్థానికులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర దేవస్థానం కార్యనిర్వహణాధికారి వేణుగోపాల చారి, మూడు మోహన్, కార్యదర్శి నెహ్రూ, భీమవరపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళపై లైంగిక వేధింపులు, బెదిరింపుల కేసులో నిందితుడికి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.10 వేల జరిమానా



కారేపల్లి నవంబర్ 05 నిర్భయ వార్త రిపోర్టర్. మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడటంతో పాటు బెదిరింపులకు గురిచేసిన కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి న్యాయస్థానం మూడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధించింది. కారేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో 2019లో నమోదైన క్రైమ్ నంబర్ 48/2019 కేసులో, మేకలతండాకు చెందిన భూక్యా లచ్చిరాం (42)పై ఐపీసీ సెక్షన్లు 354, 506 కింద కేసు నమోదైంది. ఈ కేసులో నేరారోపణలు రుజువు కావడంతో ఖమ్మం మూడవ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి శ్రీ ఏ. ప్రవీణ్ కుమార్ నిందితుడు-1 భూక్యా లచ్చిరాంకు మూడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈ కేసులో మొదటి దర్యాప్తు అధికారి ఏఎస్ఐ బి. కృష్ణ ప్రసాద్, ప్రధాన దర్యాప్తు అధికారి పి. వెంకన్న సమర్థవంతంగా దర్యాప్తు నిర్వహించారు. కోర్టులో కేసు విచారణ సందర్భంగా పోలీసు అధికారులు సమన్వయంతో వ్యవహరించి నేర నిరూపణకు సహకరించారు. కేసు విచారణలో సహకరించిన కోర్టు డ్యూటీ ఆఫీసర్ సిహెచ్.నాగేశ్వరరావు, ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ గాయత్రి, బ్రీఫింగ్ ఆఫీసర్ ఎస్సై పి. గోపి, లైజన్ అధికారి ఎస్ఐ కె. శ్రీకాంత్‌లను అడిషనల్ డీసీపీ రామానుజం అభినందించారు.

నూతన వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్‌కు డీఎంహెచ్ఓ అభినందనలు

ఎం.డి. ముషారఫ్ అలీ ఫారూఖీని మర్యాదపూర్వకంగా కలిసిన డాక్టర్ కె. ఆనంద్





హైదరాబాద్ నవంబర్ 05 నిర్భయవార్త ప్రతినిధి తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ నూతన డైరెక్టర్/కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎం.డి. ముషారఫ్ అలీ ఫారూఖీ, ఐఏఎస్‌ను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. ఆనంద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిషనర్ కార్యాలయంలో ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, నూతన బాధ్యతలు స్వీకరించినందుకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ముసురు తుఫాన్‌తో పంటలకు తీవ్ర నష్టం!

నీట మునిగిన వరి.. దెబ్బతిన్న మిరప తోటలు

అన్నదాతల్లో ఆందోళన.. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు



నిర్భయ వార్త నవంబర్ 4,ఖమ్మం జిల్లా ప్రతినిధి ముసురు తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలు ఖమ్మం జిల్లా రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జిల్లావ్యాప్తంగా వరి పంటలు నీట మునగగా, మిరప తోటలు సైతం తీవ్రంగా దెబ్బతిన్నాయి. చేతికొచ్చే దశలో ఉన్న పంటలు వర్షాల కారణంగా దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా వరి పొలాల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో పంటకు నష్టం వాటిల్లే ప్రమాదం ఏర్పడింది. మరోవైపు మిరప తోటల్లో అధిక తేమ కారణంగా మొక్కలు దెబ్బతినడం, వేరుకుళ్లు, తెగుళ్లు వ్యాపించే పరిస్థితులు నెలకొన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే సాగు కోసం పెట్టుబడులు పెట్టిన రైతులకు ఈ వర్షాలు మరింత భారంగా మారాయి. అప్పులు చేసి పంటలు సాగు చేసిన తమకు ప్రకృతి వైపరీత్యాలు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయని రైతులు వాపోతున్నారు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేయాలని కోరుతున్నారు. నష్టపోయిన ప్రతి రైతును గుర్తించి ప్రభుత్వం తక్షణమే పంట నష్టపరిహారం అందించాలని, అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఓటు బచావో -- దేశ్ బచావో కార్యక్రమం విజయవంతం చేసిన కాంగ్రెస్ శ్రేణులకు అభినందనలు

కాంగ్రెస్ కార్యాలయంలో బండి రమేష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు





కూకట్‌పల్లి, నవంబర్ 05 నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించిన 'ఓటు బచావో -- దేశ్ బచావో' కార్యక్రమాన్ని విజయవంతం చేసి తిరిగి వచ్చిన కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు, సీనియర్ నాయకులకు అభినందనలు తెలియజేస్తూ గురువారం కూకట్‌పల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం శ్రీ హేమదుర్గ భవన్‌లో విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలు ఆనందోత్సాహాలతో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ ఢిల్లీలో నిర్వహించిన 'ఓటు బచావో -- దేశ్ బచావో' కార్యక్రమానికి కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు, సీనియర్ నాయకులు పెద్ద సంఖ్యలో బస్సుల ద్వారా తరలివెళ్లి కార్యక్రమాన్ని విజయవంతం చేయడం అభినందనీయమన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ శ్రేణులంతా ఐక్యంగా ముందుకు సాగడం గర్వకారణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ, భవిష్యత్తులోనూ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ చేపట్టే ప్రతి కార్యక్రమంలో కార్యకర్తలు, నాయకులు ఇదే ఉత్సాహంతో పాల్గొని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.



పదవులకే వన్నె తెచ్చిన జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎస్పీ.

మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ




నిర్భయవార్త ప్రతినిధి :మచిలీపట్నం, అక్టోబర్ 5 :కృష్ణా జిల్లా వ్యాప్తంగా జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎంతో పకడ్బందీగా ఎన్నికలు నిర్వహించి జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ పదవులకి వన్నె తెచ్చిన డీ కే బాలాజీ మరియు విద్యాసాగర్ నాయుడుకు మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ జిల్లా ప్రజల తరఫున ధన్యవాదాలు తెలియజేశారు.. గురువారం మచిలీపట్నంలో విలేకరులతో మాట్లాడుతూ ఒక పక్కన రెండు తుఫాన్లు మరొక పక్కన నగర, రూరల్ ఎన్నికలను ఎదుర్కొని జిల్లా ప్రజల చేత శే హభాష్ అనిపించుకున్న జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీమరియు వారి సిబ్బంది అభినందనీయులన్నీ బాలాజీ అన్నారు. ఎక్కడ ప్రాణ నష్టం జరగకుండా తుఫానులు ఎదుర్కొని ఎక్కడ రీపోలింగ్ జరగకుండా ఎన్నికల నిర్వహించి ఆదర్శవంతమైన పాలన అందించారని బాలాజీ అన్నారు. పోలీస్, రెవెన్యూ, ఉపాధ్యాయులు, పంచాయతీ,మున్సిపల్ విద్యుత్ మరియు ఎన్నికల అనుబంధంగా పనిచేసిన ప్రతి ఒక్కరూ అభినందనీయులన్నీ బాలాజీ అన్నారు.ఎన్నికల ఫలితాలను తుఫాను సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేసి అప్రమత్తం చేసిన ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా కూడా బాలాజీ ధన్యవాదాలు తెలియజేశారు. నూతనంగా ఎన్నికైన అభ్యర్థులు నీతివంతమైన సమర్థవంతమైన పాలన అందించి వారి పదులకు వన్నే తీసుకురావాలని బాలాజీ విజ్ఞప్తి చేశారు.

ఎంపీటీసీ, జెడ్పీటీసీ కౌంటింగ్ కేంద్రాలు

నిర్భయవార్త ప్రతినిధి :విజయవాడ:ఈ నెల 7వ తేదీన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ జరుగుతుందని.. ఇందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎ.కొండూరు, విస్సన్నపేట, తిరువూరు, గంపలగూడెం మండలాల సెగ్మెంట్లకు సంబంధించి కౌంటింగ్ తిరువూరులోని శ్రీ వాహిని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల కేంద్రంలో జరుగుతుందన్నారు. విజయవాడ రూరల్ మండలానికి సంబంధించి విజయవాడ సబ్ కలెక్టర్ కార్యాలయం, ఓల్డ్ మాంటిస్సోరి కళాశాలలో జరుగుతుందన్నారు. జి.కొండూరుకు కుంటముక్కలలోని లక్కిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కౌంటింగ్ జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా మైలవరం, రెడ్డిగూడెం మండలాలకు మైలవరంలోని లక్కిరెడ్డి హనిమిరెడ్డి ఇండోర్ స్టేడియంలో, ఇబ్రహీంపట్నంకు కొండపల్లి జెడ్పీ బాలికల హైస్కూల్‌లో, జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాలకు జగ్గయ్యపేటలోని ఎస్‌జీఎస్ కళాశాల కేంద్రంలో జరుగుతుందన్నారు. నందిగామ మండలానికి నందిగామ జెడ్పీ ఉన్నతపాఠశాలలో, చందర్లపాడుకు నందిగామ కేవీఆర్ డిగ్రీ కళాశాలలో కంచికచర్ల, వీరుళ్లపాడు మండలాలకు కంచికచర్ల మార్కెట్‌యార్డులో ఏర్పాటుచేసిన కౌంటింగ్ కేంద్రంలో కౌంటింగ్ ప్రక్రియకు ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

కృష్ణా-గుంటూరు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు నేడే చివరి తేదీ

ఒక్క రోజు మాత్రమే గడువు ఉంది



నిర్భయవార్త ప్రతినిధి :గుంటూరు, నవంబరు 5 : కృష్ణా–గుంటూరు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటరుగా నమోదుకు కావడానికి నవంబరు ఆరవ తేదీ వరకు మాత్రమే గడువు ఉందని కృష్ణా–గుంటూరు ఉపాధ్యాయ నియోజకవర్గం ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి మరియు జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి తెలిపారు. ఒక్కరోజు మాత్రమే గడువు ఉందని, అర్హులైన ఉపాధ్యాయులు వెంటనే ఫారం–19 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రతి ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి ఓటర్ల జాబితాను కొత్తగా రూపొందించడం జరుగుతుందని, గతంలో ఓటర్లుగా నమోదైన ఉపాధ్యాయులు సైతం ప్రస్తుత ఎన్నికల కోసం కొత్తగా ఫారం–19 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులు అందరూ గడువు ముగిసేలోగా దరఖాస్తులను సమర్పించాలని సూచించారు.గత ఎన్నికల సమయంలో 13,505 మంది ఉపాధ్యాయులు ఓటర్లుగా నమోదు కాగా, ప్రస్తుత నమోదు ప్రక్రియలో ఇప్పటి వరకు 10,909 దరఖాస్తులు మాత్రమే అందాయని తెలిపారు. గత ఎన్నికల గణాంకాలతో పోలిస్తే ఇంకా సుమారు 2,600 మందికి పైగా అర్హులైన ఉపాధ్యాయులు ఓటర్లుగా నమోదు కావాల్సి ఉందని పేర్కొన్నారు. అర్హులైన ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు అందరూ గడువు తేదీ, నవంబరు 6వ తేదీ లోగా ఫారం–19 ద్వారా ఓటర్లుగా నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.









ప్రజాస్వామ్య పండగలో ఎన్ఎస్ఎస్ సేవా స్ఫూర్తి

- పోలింగ్ నిర్వహణలో పోలీసులకు అండగా వాలంటీర్లు
- ఓటర్లకు అవసరమైన సహాయసహకారాలు అందించడంలో ప్రత్యేకత

నిర్భయవార్త ప్రతినిధి : విజయవాడ:ఎంపీటీసీ, జెడ్‌పీటీసీ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) వాలంటీర్లు తమ సేవా స్ఫూర్తిని చాటుకున్నారు. విజయ వాడ, మైలవరం, తిరువూరు, జగ్గయ్యపేట, నందిగామ మండలాలకు చెందిన 10 కళాశాలల నుంచి సుమారు 900 మంది విద్యార్థి వాలంటీర్లు ఉత్సాహంగా పాల్గొని ఎన్నికల విధుల నిర్వహణలో తమ సేవలందించారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అవసరమైన సహాయ సహకారాలు అందించడంతో పాటు క్యూ లైన్ల నిర్వహణ, ఓటర్ల రాకపోకల క్రమబద్ధీకరణ, పోలింగ్ కేంద్రాల వద్ద క్రమశిక్షణ పాటించేలా సహకరించారు. ఎన్నికల విధుల్లో పోలీసు సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించారు. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు సహాయం అవసరమైన ఓటర్లకు అవసరమైన సహకారం అందిస్తూ పోలింగ్ ప్రక్రియలో వారికి ఇబ్బందులు కలగకుండా తోడ్పడ్డారు. యువతలో సామాజిక బాధ్యత, సేవా భావం పెంపొందించడంలో ఎన్ఎస్ఎస్ కీలక పాత్ర పోషిస్తోందని, ప్రజాస్వామ్య ఎన్నికల ప్రక్రియలో వాలంటీర్లు స్వచ్ఛందంగా భాగస్వాములు కావడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పేర్కొన్నారు. ఎన్నికల విధుల్లో పోలీసు సిబ్బందితో కలిసి బాధ్యతాయుతంగా సేవలందించిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను ప్రత్యేకంగా అభినందించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు మార్గనిర్దేశనం చేయడంలో జిల్లా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. కొల్లేటి రమేష్ కీలకపాత్ర పోషించారు.

ఈ నెల 7న ఎంపీటీసీ, జెడ్‌పీటీసీ ఎన్నికల కౌంటింగ్

– ప్రక్రియ విజయవంతానికి పకడ్బందీ ఏర్పాట్లు
– జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ




నిర్భయవార్త ప్రతినిధి :విజయవాడ:జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను ఈ నెల 7వ తేదీన విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు.ఎన్నికల ప్రక్రియలో తదుపరి కీలక ఘట్టమైన ఓట్ల లెక్కింపు నిర్వహణకు సంబంధించి మైలవరం, రెడ్డిగూడెం మండలాలకు సంబంధించి



మైలవరంలోని లక్కిరెడ్డి హనిమిరెడ్డి ఇండోర్ స్టేడియంలో కౌంటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాన్ని కలెక్టర్ లక్ష్మీశ గురువారం తనిఖీ చేశారు. ఎన్నికల సామగ్రి, బ్యాలెట్ బాక్సుల భద్రత, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లు, కౌంటింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలపై అధికారులతో సమీక్షించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలు, మార్గదర్శకాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. కౌంటింగ్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

ఓటు వేసిన టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ

నిర్భయవార్త ప్రతినిధి :వ ు చి లీ ఎ ట్ట ం ప్రతినిధి:మచిలీపట్నం నార్త్ మండలం కానూరు గ్రామ పంచాయతీ పరిధిలోని 3వ పోలింగ్ బూత్‌లో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల సందర్భంగా కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారా యణ మొదటి ఓటు వేశారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా పోలింగ్ ప్రారంభమైన వెంటనే ఆయన పోలింగ్ కేంద్రానికి చేరుకుని తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు



కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక పుణ్యక్షేత్ర దర్శన ప్యాకేజీలను ప్రవేశపెట్టిన ఏపీటీడీసీ.

ప్రతి సోమవారం పంచారామాల యాత్ర -- ప్రతి శనివారం వాడపల్లి పుణ్యక్షేత్ర యాత్ర

నిర్భయవార్త విజయవాడ:పవిత్ర కార్తీక మాసాన్ని పురస్కరించుకొని భక్తులకు ప్రత్యేక పుణ్యక్షేత్ర దర్శన ప్యాకేజీలను ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) అందుబాటులోకి తీసుకువస్తోందని ఏపీటీడీసీ జనరల్ మేనేజర్ (టూర్స్ & మార్కెటింగ్) టి. ఎస్. వీరనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలను సౌకర్యవంతంగా దర్శించుకొని ఆధ్యాత్మిక అనుభూతిని పొందేందుకు ఈ ప్రత్యేక యాత్రలను రూపొందించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్తీక మాసంలో ప్రతి సోమవారం పంచారామాల యాత్రను, ఏడాది పొడవునా ప్రతి శనివారం విజయవాడ--వాడపల్లి--విజయవాడ పుణ్యక్షేత్ర యాత్రను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ యాత్రలను ఏపీటీడీసీ 12 సీట్ల మినీ ఏసీ బస్సు ద్వారా నిర్వహించి భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించనున్నట్లు వివరించారు. పంచారామాల ప్రత్యేక ప్యాకేజీఒకే రోజులో ఐదు పవిత్ర పంచారామ క్షేత్రాలను దర్శించుకునే ఈ ప్రత్యేక ప్యాకేజీలోఅమరలింగేశ్వర స్వామి ఆలయం (అమరావతి), కువారారామ భీమేశ్వర స్వామి ఆలయం (సామర్లకోట), భీమేశ్వర స్వామి ఆలయం (ద్రాక్షారామం), క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయం (పాలకొల్లు), సోమేశ్వర స్వామి ఆలయం (భీమవరం) దర్శించుకునే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు.ఈ యాత్ర నవంబర్ 16, 23, 30 తేదీలతో పాటు డిసెంబర్ 7, న కూడా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 5 గంటలకు విజయ వాడలోని లెమన్ ట్రీ హోటల్ పక్కన ఉన్న ఏపీటీడీసీ సెంట్రల్ రిజ ర్వేషన్ కార్యాలయం నుంచి యాత్ర ప్రారంభమై, అదే రోజు రాత్రి సుమారు 10 గంటలకు తిరిగి విజయవాడ చేరుకుంటుందని తెలిపారు. ప్యాకేజీకి పెద్దలకు రూ. 2,370, పిల్లలకు రూ. 1,920 చార్జీగా నిర్ణయించినట్లు తెలిపారు. దర్శన టికెట్లు, భోజనం మరియు ఇతర వ్యక్తిగత ఖర్చులను ప్రయాణికులే భరించాల్సి ఉంటుందని తెలిపారు.ప్రతి శనివారం వాడపల్లి పుణ్యక్షేత్ర యాత్రవిజయవాడ నుంచి వాడపల్లిలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి ప్రతి శనివారం ఏడాది పొడవునా ప్రత్యేక ప్యాకేజీ నిర్వహిస్తున్నట్లు వీరనారాయణ తెలిపారు. ఈ యాత్ర ద్వారా భక్తులు అదే రోజు స్వామివారిని దర్శించుకొని తిరిగి విజయవాడ చేరుకునేలా రవాణా సదుపాయం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్యాకేజీకి పెద్దలకు రూ. 1,350, పిల్లలకు రూ. 1,100 చార్జీగా నిర్ణయించినట్లు తెలిపారు. దర్శన టికెట్లు, భోజనం మరియు ఇతర వ్యక్తిగత ఖర్చులు ప్రయాణికులే భరించాల్సి ఉంటుందని వివరించారు.ఆధ్యాత్మిక పర్యాటకానికి ప్రోత్సాహంఆంధ్రప్రదేశ్‌లో ఆధ్యాత్మిక పర్యాటకాన్ని ప్రోత్సహించడంతో పాటు భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన మరియు ఇబ్బందులు లేని పుణ్యక్షేత్ర యాత్రలను అందించడమే ఏపీటీడీసీ లక్ష్యమని టి. ఎస్. వీరనారాయణ, జనరల్ మేనేజర్ (టూర్స్ & మార్కెటింగ్) తెలి పారు.కార్తీక మాసం సందర్భంగా భక్తులు ఈ ప్రత్యేక ప్యాకేజీలను సద్వినియోగం చేసుకొని పవిత్ర పుణ్యక్షేత్రాలను దర్శించుకోవాలని ఏపీటీడీసీ జనరల్ మేనేజర్ (టూర్స్ & మార్కెటింగ్) టి. ఎస్. వీరనారాయణ ఆ ప్రకటనలో తెలిపారు.

ఏసీబీ వలలో మెప్మా ఏడీ.. ఇంట్లో కిలోల కొద్దీ బంగారం, ఆస్తిపత్రాలు గుర్తింపు

నిర్భయవార్త ప్రతినిధి :పురపాలక ప్రాంతాల్లో పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) అదనపు డైరెక్టర్ నల్లగుంట్ల యాదగిరి రావు అక్రమాస్తుల కేసులో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కి చిక్కారు. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారన్న ఆరోపణలతో ఆయనపై కేసు నమోదు చేసిన ఏసీబీ అధికారులు, జరిపిన సోదాల్లో సుమారు రూ. 4.75 కోట్ల విలువైన ఆస్తులను గుర్తించారు. మంగళవారం హైదరాబాద్‌తో పాటు మొత్తం 10 ప్రాంతాల్లో ఏసీబీ బృందాలు ఏకకాలంలో దాడులు నిర్వహించాయి. యాదగిరి రావు నివాసం, కార్యాలయం, బంధువులు, బినామీలకు సంబంధించిన ఇళ్లలో ఈ సోదాలు జరిగాయి.ఏసీబీ డీసీపీ ఆనంద్ కుమార్ వెల్లడించిన వివరాల ప్రకారం, ఉప్పల్ హైకోర్టు కాలనీలో 334 గజాల స్థలంలో నిర్మించిన +o3 భవనం విలువ సుమారు రూ. 2 కోట్లు ఉంటుందని అంచనా. దీంతో పాటు ఉప్పల్‌లోనే రెండు ఫ్లాట్లు, ఒక వాణిజ్య దుకాణం, హబ్సిగూడ, పెద్ద అంబర్‌పేట్, మేడిపల్లి, సూర్యాపేట, నల్గొండ జిల్లాల్లో మొత్తం 12 ఓపెన్ ప్లాట్లు ఉన్నట్లు పత్రాలను గుర్తించారు.సోదాల్లో సుమారు 1.8 కిలోల బంగారం (1,792 గ్రాములు), 3 కిలోల వెండి ఆభరణాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు రూ. 73 లక్షల విలువైన టయోటా ఫార్చూనర్, మరో కారు, మూడు ద్విచక్ర వాహనాలను గుర్తించారు. వివిధ బ్యాంకు ఖాతాల్లో రూ. 32.30 లక్షల నగదు నిల్వలు, రూ. 29 లక్షల విలువైన గృహోపకరణాలు, రూ. 7 లక్షల విలువైన ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు ఉన్నట్లు తేలింది.ప్రభుత్వ రికార్డుల ప్రకారం ఈ ఆస్తుల విలువ రూ. 4.75 కోట్లుగా లెక్కగట్టామని, బహిరంగ మార్కెట్‌లో వీటి విలువ ఇంకా చాలా ఎక్కువగా ఉంటుందని ఏసీబీ అధికారులు భావిస్తున్నారు.

ఓటు హక్కును కాలరాస్తే సహించేది లేదు!

-ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధం
-వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని పోలీసుల వేధింపులు
రవికుమార్‌రెడ్డిని ఓటు వేయించి ఇంటికి పంపించే బాధ్యత నాది: మేకపాటి విక్రమ్‌రెడ్డి.



ఆత్మకూరు నిర్భయవార్త ప్రతినిధి :ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు అని, ఆ హక్కును అడ్డుకునే ప్రయత్నాలను సహించేది లేదని ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి విక్రమ్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో అధికార పార్టీ అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. అనంతసాగరం మండలం శంకరనగరం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పార్లపల్లి రవికుమార్‌రెడ్డిని పోలీసులు ఆత్మకూరు పోలిస్ స్టేషన్ కు తరలించాలన్న విషయం తెలుసుకున్న ఆయన పార్టీ నాయకులతో కలిసి ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని పోలీసులను నిలదీశారు. సుమారు 130 మందిని బైండోవర్ చేయాల్సి ఉండగా, ఒక గ్రామానికి చెందిన నాయకుడిని మాత్రమే పోలీస్‌స్టేషన్‌కు తీసుకురావాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు.అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గంలో 67 ఎంపీటీసీ సెగ్మెంట్లు ఉండగా, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఓటమి భయంతో స్ట్రూటినీ సమయంలో అధికారులను అడ్డుపెట్టుకుని వివిధ కారణాలు చూపుతూ వైఎస్సార్‌సీపీకి గెలుపు అవకాశాలున్న సుమారు 30 సెగ్మెంట్లలో పోటీకి అవకాశం లేకుండా చేశారని, మిగిలిన 37 సెగ్మెంట్లలో జరుగుతున్న పోలింగ్‌లోనూ వైఎస్సార్‌సీపీ శ్రేణులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు.పోలింగ్ కేంద్రాల వద్ద వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను బయటకు పంపించడం, నాయకులను బైండోవర్ పేరుతో పోలీస్‌స్టేషన్లకు తరలించడం, మరికొందరిని ఇళ్ల వద్ద నిర్బంధించడం వంటి చర్యలకు పోలీసులు పాల్పడుతున్నారని, అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించకుండా పోలీసులు నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని హితవు పలికారు.గతంలో రవికుమార్‌రెడ్డిపై దాడి చేసి, ఆయన ఇంటిని ధ్వంసం చేయడంతోపాటు కుటుంబ సభ్యులపై రౌడీషీట్లు నమోదు చేశారని, తాజాగా ఓటు వేసేందుకు వెళుతున్న సమయంలో ఎస్ఐ రాజేష్ ఆయనను పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడిన విక్రమ్‌రెడ్డి, రవికుమార్‌రెడ్డికి ముందుగా ఓటు వేసే అవకాశం కల్పించాలని కోరారు. ఆయన పూర్తి బాధ్యత నాది.. ఓటు వేసిన తర్వాత క్షేమంగా ఇంటికి పంపించే బాధ్యత కూడా నాదే అని స్పష్టం చేశారు.ఎన్నికల్లో గెలుపోటములు ప్రజల తీర్పుపైనే ఆధారపడి ఉండాలని, బెదిరింపులు, పోలీసుల ఒత్తిళ్లతో ఎన్నికల్లో విజయం సాధించాలనుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విక్రమ్‌రెడ్డి అన్నారు. 30 స్థానాల్లో పోటీకి అవకాశం లేకుండా చేసి, మిగిలిన 37 స్థానాల్లోనూ వైఎస్సార్‌సీపీ శ్రేణులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. ఎన్నికల ప్రక్రియలో జరిగిన అక్రమాలపై న్యాయపరమైన పోరాటం కొనసాగిస్తామని, అవసరమైతే తిరిగి ఎన్నికలు నిర్వహించే వరకు వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అప్రమత్తంగా ఉన్నారని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని, ఓటరు హక్కును కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల అధికారులు, పోలీసులపై ఉందని, పోలింగ్‌ను స్వేచ్ఛగా, ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు.

కోవూరులో ప్రశాంతంగా జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్..

నియోజకవర్గవ్యాప్తంగా పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించిన ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి
వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పోలింగ్ కేంద్రాలను నేరుగా సందర్శించిన ఎమ్మెల్యే.



నెల్లూరు నిర్భయవార్త ప్రతినిధి :కోవూరు నియోజకవర్గంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగింది. ఎన్నికల ప్రక్రియను గౌరవ శాసనసభ్యులు శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గారు ఎప్పటికప్పుడు నిశితంగా పర్యవేక్షించారు. ఎన్నికల ప్రక్రియ సాగిన తీరును తెలుసుకునేందుకు స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి పోలింగ్ సరళిని పరిశీలించారు. ఓ వైపు వర్షం కురుస్తున్నప్పటికీ ఏమాత్రం వెనుకడుగు వేయకుండా ఎమ్మెల్యే గారు వివిధ ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి, స్థానిక నాయకులతో మాట్లాడి అక్కడి పోలింగ్ సరళిని తెలుసుకున్నారు. అధికారులను అడిగి పోలింగ్ శాతంపై వివరాలు సేకరించారు. కోవూరులోని శాంతినగర్, పడుగుపాడులోని టీఎన్‌సీ కాలేజీ వద్ద ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఎన్నికల నిర్వహణ తీరును ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గారు పరిశీలించారు. అలాగే, కొడవలూరు మండలంలోని నార్త్ రాజుపాళెం, విడవలూరు, అన్నారెడ్డిపాళెం, ముదివర్తి, ఊటుకూరు, రామతీర్థం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి అయా ప్రాంతాల్లో పోలింగ్ సరళిపై ఆరా తీశారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ అధికారులు, స్థానిక నాయకులతో నిరంతరం సంప్రదింపులు జరిపి ఎన్నికల పరిస్థితులను సమీక్షించారు.

100% స్ట్రైకింగ్ రేట్ తో నెల్లూరు కార్పొరేషన్ లో జనసేన విజయం...

ఘనంగా జనసేన విజయ కేతనం ర్యాలీ...



నెల్లూరు నిర్భయవార్త ప్రతినిధి :: నెల్లూరు నగరంలోని 21వ డివిజన్‌లో కూటమి బలపరిచిన జనసేన పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఘనవిజయం సాధించిన వీర మహిళ గునుకుల విజయలక్ష్మీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక గుర్రాలమడుగు సంఘం నుంచి విజయ కేతనం ర్యాలీ ఘనంగా నిర్వహించారు. తనను ఆదరించి, ఆశీర్వదించి, ఓట్లు వేసి కార్పొరేటర్‌గా గెలిపించిన 21వ డివిజన్ ప్రజలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తూ, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలియజేస్తూ విజయలక్ష్మి ర్యాలీ ద్వారా ప్రజలను నేరుగా కలుసుకున్నారు.ఈ సందర్భంగా ప్రజలు ఆమెకు ఘనస్వాగతం పలికి అభినందనలు తెలియజేశారు. తన విజయానికి సహకరించిన ప్రతి ఓటరుకు, జనసేన, తెలుగుదేశం, భారతీయ జనతా పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, కూటమి శ్రేణులకు విజయలక్ష్మి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ ర్యాలీలో సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు, మాజీ చైర్‌పర్సన్, మాజీ మంత్రి తాళ్లపాక రమేష్ గారి సతీమణి శ్రీమతి అనురాధ గారు, జనసేన నాయకులు కిషోర్ గునుకుల గారితో పాటు జనసేన, తెలుగుదేశం, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ, తనపై నమ్మకంతో కార్పొరేటర్‌గా అవకాశం కల్పించిన ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తానని, డివిజన్ అభివృద్ధికి కూటమి నాయకుల సహకారంతో కట్టుబడి ఉంటానని తెలిపారు. ఎన్నికల్లో తన విజయానికి కృషి చేసిన కూటమి నాయకులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎన్నికల విధుల్లో పాల్గొన్న సిబ్బందికి నవంబర్ 6న (నేడు) ప్రత్యేక సాధారణ సెలవు




నెల్లూరు, నవంబర్ 5 నిర్భయవార్త ప్రతినిధి : నెల్లూరు జిల్లా వ్యాప్తంగా నవంబర్ 5న నిర్వహించిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ విధుల్లో పాల్గొన్న ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర పోలింగ్ సిబ్బందికి నవంబర్ 6వ తేదీన ప్రత్యేక సాధారణ సెలవు వర్తింపజేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా ఆదేశించారు. ఎన్నికల విధుల్లో సుదీర్ఘ సమయం పాటు పనిచేసిన సిబ్బంది మరుసటి రోజు విధులకు హాజరుకాని పక్షంలో, వారి గైర్హాజరును ఆన్ డ్యూటీగా పరిగణించాలని అన్ని సెలవుల మంజూరు అధికారులకు సూచించారు. అయితే, వీరు ఎన్నికల విధులకు సంబంధించిన నియామక ఉత్తర్వులు, రిటర్నింగ్ అధికారి లేదా అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి జారీ చేసిన డ్యూటీ సర్టిఫికెట్‌ను సమర్పించాల్సి ఉంటుంది. ఎన్నికల విధుల్లో వాస్తవంగా పాల్గొన్న సిబ్బందికి డ్యూటీ సర్టిఫికెట్లు జారీ చేయాలని రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు.

విడవలూరు మండలంలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ విద్యుత్ శాఖ ఎస్.ఈ. సుధాకర్

నెల్లూరు, అక్టోబర్ 05: నిర్భయవార్త ప్రతినిధి : విడవలూరు మండలం, ముదివర్తి గ్రామ పంచాయతీ పరిధిలోని గాంధీనగర్ సంఘం, గిరిజన కాలనీ, తుఫాన్ బిల్డింగ్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో ఏర్పడిన అంతరాయాన్ని సరిచేసి, బుధవారం మధ్యాహ్నమే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు విద్యుత్ శాఖ ఎస్.ఈ. సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేగూరు అగ్రికల్చర్ ఫీడర్ ద్వారా ఈ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా జరుగుతోందని, ఫీడర్ నుంచి సంబంధిత ప్రాంతాల వరకు సుమారు ఏడు కిలోమీటర్ల మేర పొలాల మధ్య 11 కేవీ విద్యుత్ లైన్ విస్తరించి ఉందని పేర్కొన్నారు. దీంతో విద్యుత్ అంతరాయానికి గల కారణాన్ని గుర్తించి, మరమ్మతులు చేపట్టి పూర్తి చేయడానికి కొంత సమయం పట్టిందని వివరించారు.అయినప్పటికీ, విద్యుత్ శాఖ సిబ్బంది సమన్వయంతో కృషి చేసి మరమ్మతు పనులను పూర్తి చేసి, బుధవారం (04-11-2026) మధ్యాహ్నమే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు తెలిపారు. ప్రస్తుతం సంబంధిత ప్రాంతాల ప్రజలకు విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు లేవని ఆయన ఆ ప్రకటనలో స్పష్టం చేశారు

పదవ తరగతి విద్యార్థులకు ఎంఈఓ దిశానిర్దేశం



సీతారామపురం నిర్భయవార్త ప్రతినిధి : ఎస్ఎస్సీ మిషన్ మార్చి--2026 కార్యక్రమంలో భాగంగా గురువారం బసినేనిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంఈఓ మస్తాన్ వలి సందర్శించారు.ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులతో ముచ్చటించి, వారి చదువుల తీరు, పరీక్షలకు చేస్తున్న సన్నద్ధత గురించి అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిరోహించాలంటే ఇప్పటి నుంచే కష్టపడి చదవాలని, పదవ తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించి తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.అనంతరం పాఠశాలలో చదువుతున్న 8వ తరగతి ఎన్ఎంఎంఎస్ విద్యార్థులతో కూడా మాట్లాడి, వారి విద్యాభ్యాసంపై పలు సూచనలు, సలహాలు అందించారు. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని పట్టుదలతో చదివి ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు కొండయ్య పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకున్న..

నెల్లూరు జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్ పర్సన్ మేకపాటి శాంతకుమారి..



మర్రిపాడు నిర్భయవార్త ప్రతినిధి : మర్రిపాడు మండలంలోని తమ స్వగ్రామమైన కంపసముద్రం గ్రామంలో జరిగిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల సందర్భంగా ఉమ్మడి నెల్లూరు జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్ పర్సన్ శ్రీమతి మేకపాటి శాంతి కుమారి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

అభివృద్ధి, సంక్షేమానికే ప్రజల పట్టం

చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు

ఎస్సార్ పురం మండలంలో విస్తృతంగా పర్యటించిన పార్లమెంట్ సభ్యులు

పోలింగ్ సరళిని పరిశీలించి, కూటమి అభ్యర్థుల విజయం పై ధీమా వ్యక్తం చేసిన ఎంపీ దగ్గుమళ్ళ



ఎస్ఆర్ పురం . నిర్భయవార్త ప్రతినిధి : జీడీ నెల్లూరు నియోజకవర్గం, ఎస్సార్ పురం మండలంలో గురువారం జరిగిన ఎంపీటీసీ,జడ్పీటీసీ స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ సరళిని చిత్తూరు పార్లమెంట్ సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు స్వయంగా పరిశీలించారు. మండలంలోని నెలవాయి, మంగుంట, ముదిగుప్పం, సొక్కమడుగు, క్షీరసముద్రం, హరిమాకులపల్లి తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఓటర్లతో మాట్లాడి, పోలింగ్ జరుగుతున్న తీరును, స్థానిక పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, అందుతున్న సంక్షేమ పథకాలకే ప్రజలు మరోసారి పట్టం కడతారనే ఆశాభావం వ్యక్తం చేశారు. చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో కూటమి బలపరిచిన ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, అత్యధిక స్థానాల్లో కూటమి అభ్యర్థుల విజయం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు ఉత్సాహంగా ఓటింగ్ ప్రక్రియలో పాల్గొనడం శుభపరిణామమని, స్థానిక సంస్థల బలోపేతానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా ఎంపీ పునరుద్ఘాటించారు. ఈ పర్యటనలో ఆయనతో పాటు కూటమి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

మాతృశ్రీ బ్రాహ్మణ భవన మొదటి అంతస్తు నిర్మాణ పనులు ప్రారంభం



నెల్లూరు నిర్భయవార్త ప్రతినిధి : పుష్పగిరి మహా సంస్థాన పీఠాధిపతులు జగద్గురువు శ్రీ శ్రీ శ్రీ అభినవోద్దండ విద్యా శంకర భారతి స్వామీ వారి దివ్య ఆశీస్సులతో శ్రీ పుష్పగిరి నృసింహ భారతి స్వామివారి బ్రాహ్మణ భవన సముదాయంలో శ్రీ మాతృశ్రీ బ్రాహ్మణ భవన మొదటి అంతస్తు నిర్మాణ ప్రారంభ పూజ కార్యక్రమం గురువారం స్థానిక పుత్త ఎస్టేట్స్,పోర్లు కట్ట, మునుమ సిద్ధి నగర్, నెల్లూరు. స్రూూ= నెల్లూరు జిల్లా బ్రాహ్మణ సేవా సంఘాల సమితి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఏపీ టిట్కో చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్, ఏపీ బ్రాహ్మణ కోపరేటివ్ సొసైటీ లిమిటెడ్ డైరెక్టర్ ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్, టీవీఎస్ కళ్యాణ సదన్ మేనేజింగ్ ట్రస్టీ దేశబోట్ల ఫణి రత్నం, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ ప్రముఖులు తడకపల్లి రవీంద్రబాబు దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొన్న అధ్యక్షులు గుడ్లదొన వాసుదేవరావు, కార్యనిర్వాహక అధ్యక్షులు వేదగిరి వెంకట సాయి ఫణి శంకర్, ప్రధాన కార్యదర్శి దుద్దుకూరు రమేష్, కోశాధికారి రామాయణ మణి శంకర్ గణపతి పూజ వాస్తు పూజ ఆది దంపతుల పూజ మహా హోమములు పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు . ఈ కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, బాలకృష్ణ, మహిళా విభాగం అధ్యక్ష కార్యదర్శులు గడ్డం జయలక్ష్మి, బోట్లగూడూరు నాగ లక్ష్మి, మహిళా కార్యవర్గ సభ్యులు పలువురు జిల్లా అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

జనసేన పై పొంగూరు నారాయణ

కుటుంబం చూపిస్తున్న ఆప్యాయత,అనుబంధం..



నెల్లూరు నిర్భయవార్త ప్రతినిధి :నిష్కల్మష మహిళా శక్తి అందిన విజయం... మహిళా సాధికారతకు నిలువుటద్దం! మా యమ్మ రమమ్మ,మా సోదరీమణులు శర్మి, సిందూర నారాయణ, షరణి నారాయణ,అనురాధ,విజేత కూటమి ఆప్యాయతానురాగాల మధ్య ఘన విజయం! జనసేనాని శ్రీ పవన్ కళ్యాణ్ ఆకాంక్షించిన మహిళా సాధికారతకు ప్రతిరూపంగా, 21వ డివిజన్ నుంచి కార్పొరేటర్‌గా ఘనవిజయం సాధించిన శ్రీమతి గునుకుల విజయలక్ష్మి కి ఆత్మీయ ఆలింగనం చేసి అభినందనలు తెలిపిన మా ఆత్మీయులు, కుటుంబ సభ్యులు, పెద్దల మధ్య ఆనందోత్సాహాలతో విజయోత్సవం వైభవంగా సాగింది.ఈ ఆత్మీయ వేడుకలో మా రమమ్మ, మా బిడ్డలు, శ్రీమతి సిందూర గారు, శ్రీ షరిణి గారు,రుద్రమలా సౌర్యం చాటిన కోవూరు ఎమ్మెల్యే శ్రీమతి ప్రశాంతి గారు, మాజీ సర్పంచ్ తాళ్లపాక అనూరాధ గారు, మాజీ జెడ్పీటీసీ విజేత గారు తదితరుల ఆప్యాయత, ఆశీస్సులు ఎంతో ఆనందాన్ని కలిగించాయి.మహిళలు నాయకత్వ బాధ్యతలు చేపట్టి ప్రజాసేవలో ముందుండాలనే పవన్ కళ్యాణ్ గారి ఆశయానికి అనుగుణంగా, ఇంతమంది ఆదర్శప్రాయుల స్ఫూర్తిని తీసుకుని, అదే సేవాభావంతో ప్రజల మధ్య ఉంటూ మరింత బాధ్యతగా ముందుకు సాగాలని నా సతీమణి విజయలక్ష్మి గారిని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.ఈ విజయం ఒక వ్యక్తిది మాత్రమే కాదు... మహిళా శక్తికి, ప్రజల నమ్మకానికి, మహిళా సాధికారతకు దక్కిన గౌరవం.

నెల్లూరు జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా జెడ్పీటీసీ, ఎంపీటీసీ పోలింగ్

ఓటర్ల నుంచి పెరుగుతున్న స్పందన.. 65 శాతానికి పైగా పోలింగ్ నమోదయ్యే అవకాశం

సాయంత్రం ఐదు గంటల వరకు క్యూలో ఉన్న ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పిస్తాం

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హిమాన్షు శుక్ల

పొదలకూరులో పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్





నెల్లూరు, నవంబర్ 5:నిర్భయవార్త ప్రతినిధి : శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వ్యాప్తంగా జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో, పకడ్బందీ ఏర్పాట్ల మధ్య కొనసాగుతోందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. గురువారం పొదలకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పోలింగ్ జరుగుతున్న తీరును అధికారులను అడిగి తెలుసుకుని, అవసరమైన సూచనలు చేశారు. భద్రతా ఏర్పాట్లపై పోలీస్ అధికారులతో మాట్లాడి పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ, మధ్యాహ్నం 12 గంటల సమయానికి జిల్లా వ్యాప్తంగా సగటున 40 శాతం పోలింగ్ నమోదైందని తెలిపారు. తాను పరిశీలించిన పొదలకూరులోని ఆరు పోలింగ్ కేంద్రాల్లో 38 శాతానికి పైగా ఓటింగ్ నమోదైనట్లు వెల్లడించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రధాన రాజకీయ పార్టీల పోలింగ్ ఏజెంట్లు హాజరై ఉన్నారని, పోలింగ్ ప్రక్రియ నిజాయితీగా కొనసాగుతోందని పేర్కొన్నారు. జిల్లాలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదని, ఇప్పటివరకు ఎలాంటి ప్రతికూల నివేదికలు అందలేదని స్పష్టం చేశారు. ఉదయం జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో స్వల్పంగా వర్షం కురిసినప్పటికీ, ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉందని, వర్ష సూచనలు లేకపోవడంతో ఓటర్లు స్వేచ్ఛగా పోలింగ్ కేంద్రాలకు చేరుకుని తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారని తెలిపారు. సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుందని, నిర్ణీత సమయానికి పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలైన్లలో వేచి ఉన్న ఓటర్లందరికీ టోకెన్లు లేదా పాస్‌లు అందజేసి ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం కల్పిస్తామని చెప్పారు.పోలింగ్

ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సుల భద్రత, తరలింపు కోసం జిల్లా వ్యాప్తంగా ఆరు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను అధికార యంత్రాంగం పూర్తి చేసిందని కలెక్టర్ వివరించారు. గత ఎన్నికలతో పోలిస్తే ఈ ఎన్నికల్లో ఓటర్ల నుంచి స్పందన గణనీయంగా పెరిగిందని, పోలింగ్ ముగిసే సమయానికి జిల్లాలో 60 నుంచి 65 శాతానికి పైగా ఓటింగ్ నమోదయ్యే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.

పూరి గుడిసెల్లోనే చీకటి బతుకులు... గిరిజనుల గోస ఎవరికి పట్టదు...?



అనంతసాగరం:నిర్భయవార్త ప్రతినిధి : అనంతసాగరం మండల కేంద్రంలోని పడమటి కంభంపాడు గ్రామంలోని గిరిజన కాలనీని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు కొప్పాల రఘు సందర్శించారు. అనంతసాగరం మండల కమిటీ అధ్యక్షులు నీరుకట్టు శ్రీహరి ఆధ్వర్యంలో జరిగిన ఈ పర్యటనలో గిరిజన కుటుంబాల దయనీయ పరిస్థితిని ఆయన స్వయంగా చూశారు. ఈ సందర్భంగా కొప్పాల రఘు మాట్లాడుతూ ఎన్నికలప్పుడు ఓట్లు వేస్తే మీ బతుకులు మారుస్తాం అని అమాయక గిరిజనులకు మాయమాటలు చెప్పి వెళ్ళే నాయకులు, గెలిచాక మళ్ళీ ఈ గూడెం వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. ఇది చాలా దారుణం. సంవత్సరాల తరబడి ఈ గిరిజన కుటుంబాలు పూరి గుడిసెల్లోనే కరెంటు లేక బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నాయి. రాత్రి అయితే పాములు, తేళ్లు, విష కీటకాల మధ్య ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జీవిస్తున్నారు. ఇదేనా మనం చెప్పుకునే అభివృద్ధి, గ్రామంలోకి వెళ్లాలంటే సరైన రోడ్డు కూడా లేదు. జబ్బు చేస్తే ఆసుపత్రికి వెళ్లడానికి కూడా దారి లేక ఇక్కట్లు పడుతున్నారు. వీరి అర్ధనాదాలు ప్రభుత్వానికి వినిపించడం లేదా.. వెంటనే ప్రభుత్వం స్పందించి ఈ గిరిజన కాలనీకి కరెంటు, రోడ్డు, పక్కా ఇళ్లు కల్పించాలి. లేకపోతే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తాం. అవసరమైతే కలెక్టరేట్ ముట్టడిస్తాం అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ అధ్యక్షులు నీరుకట్టు శ్రీహరి, గ్రామస్తులు, గిరిజన కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.

ఈనెల 23న నెల్లూరు మేయర్, కార్పొరేటర్ల ప్రమాణ స్వీకారం : రెడ్డికే డిప్యూటీ మేయర్



నెల్లూరు నిర్భయవార్త ప్రతినిధి :: నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో నూతనంగా ఎన్నికైన 72 మంది కార్పొరేటర్లు, ఎన్నికైన మేయర్ ఈనెల 23వ తేదీనా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికలు జరిగిన కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో నూతనంగా ఎన్నికైన మేయర్లు, కార్పొరేటర్లు, చైర్మెన్లు, కౌన్సిలర్లు అదే రోజు ప్రమాణ స్వీకారం చేస్తారు. నెల్లూరు కార్పొరేషన్ కు సంభందించి 23వ తేదీ ఉదయం నెల్లూరులోని కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. ఆ సమావేశంలో నూతన మేయర్ రూప్ కుమార్ యాదవ్, 72 మంది నూతన కార్పొరేటర్లు ప్రమాణ స్వీకారం చేస్తారు. మరో వైపు డిప్యూటీ మేయర్ పదవి ఎవరిని వరిస్తుందో అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మేయర్ రూప్ కుమార్ యాదవ్ నెల్లూరు సిటీ నియోజకవర్గంకు చెందిన నాయకుడు. అందుకే డిప్యూటీ మేయర్ పదవి రూరల్ నియోజకవర్గంలోని వ్యక్తికి ఇవ్వాలని ఇప్పటికే రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి... మంత్రి నారాయణ వద్ద ప్రతిపాదన పెట్టగా ఆయన అంగీకరించినట్లు తెలిసింది. మరో వైపు డిప్యూటీ మేయర్ పదవి ఏ సామాజిక వర్గం వ్యక్తిని వరిస్తుందో కూడా ఆసక్తిగా మారింది. రిజర్వేషన్ల పరంగా నెల్లూరు మేయర్ స్థానం జనరల్ కు రిజర్వు అయింది. అయితే ఆ స్థానంలో టిడిపి అధిష్ఠానం బిసి సామాజిక వర్గంకు చెందిన రూప్ కుమార్ యాదవ్ ను పోటీకి పెట్టగా విజయం సాధించారు. జనరల్ స్థానాన్ని బీసికి కేటాయించడంతో డిప్యూటీ మేయర్ స్థానం రెడ్డి సామాజిక వర్గానికి ఇచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో నూతనంగా ఎన్నికైన రెడ్డి సామాజిక వర్గానికి చెందిన కార్పొరేటర్లలో ఒకరిని డిప్యూటీ మేయర్ పదవి వరించబోతుంది అన్న మాట. నూతన డిప్యూటీ మేయర్ ను కూడా 23న కార్పొరేటర్లు ఎన్నుకోనున్నారు.



మళ్లీ వోగ్ కవర్‌పై కత్రినా.. ఫ్యాన్స్‌కు స్పెషల్ ట్రీట్!

ఎనిమిదేళ్ల తర్వాత వోగ్ ఇండియా కవర్‌పై మెరిసిన కత్రినా కైఫ్, ప్రసవానంతరం మహిళలు వెంటనే పాత శరీరాకృతికి రావాలనే ఒత్తిడిని తప్పుబట్టారు. బిడ్డ పుట్టిన తర్వాత తన శరీరాన్ని గౌరవిస్తూ, తనకు నచ్చిన వేగంతో ఫిట్‌నెస్ సాధిస్తానని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆమె ఫొటోషూట్, వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి.బాలీవుడ్ అందాల నటి కత్రినా కైఫ్ ఎనిమిదేళ్ల విరామం తర్వాత ప్రముఖ 'వోగ్ ఇండియా' మ్యాగజైన్ నవంబర్-డిసెంబర్ 2026 సంచిక కవర్ పేజీపై మెరిసిపోయారు. భర్త వికీ కౌశల్‌తో కలిసి విహాన్ అనే బాబుకు జన్మనిచ్చిన తర్వాత ఆమె ఇచ్చిన ఈ లేటెస్ట్ ఫొటోషూట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో సెన్సేషన్‌గా మారింది. ప్రసవానంతరం మహిళల శరీరాకృతిపై సమాజం చూపే ఒత్తిడిని, 'బౌన్స్ బ్యాక్' సంస్కృతిని తిరస్కరిస్తూ కత్రినా ఇచ్చిన స్ట్రాంగ్ మెసేజ్ అందరినీ ఆకట్టుకుంటోంది. ఆ విశేషాలు ఇప్పుడు చూద్దాం. రాయల్ వింటేజ్ లుక్‌లో కత్రినా అల్టిమేట్ గ్లామర్: ఈ ప్రత్యేక ఫొటోషూట్ కోసం ప్రముఖ స్టైలిస్ట్ రియా కపూర్ కత్రినాను అత్యంత ఎలిగెంట్‌గా తీర్చిదిద్దారు. ప్రసిద్ధ డిజైనర్లు అబు జానీ సందీప్ ఖోస్లా డిజైన్ చేసిన ఐవరీ హెవీ లక్నోవి,



చిక్కన్ కారీ అవుట్‌ఫిట్‌లో కత్రినా దేవకన్యలా మెరిసిపోయారు. దీనికి తోడు లేయర్డ్ ఆక్సిడైజ్డ్ సిల్వర్ జ్యువెలరీ, స్టేట్‌మెంట్ ఇయర్ రింగ్స్ మరియు పెద్ద రింగ్ జత చేయడంతో ఆమె లుక్ రాయల్ క్లాస్‌గా మారింది. ఇక నెటిజన్లు ఈ పిక్స్‌పై "హాట్ ఎలిగెన్స్", "ఎఫర్ట్‌లెస్ బ్యూటీ" అంటూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. 'బౌన్స్ బ్యాక్' సంస్కృతిపై కత్రినా స్ట్రాంగ్ కౌంటర్: ప్రసవం తర్వాత మహిళలు వెంటనే పాత రూపానికి రావాలంటూ సమాజం తెచ్చే ఒత్తిడిపై కత్రినా ఘాటుగా స్పందించారు. "బౌన్స్ బ్యాక్ అవ్వాలా? ఎక్కడికి వెళ్లాలి? నా మనసులోని గాఢమైన కోరిక నెరవేరి నేను నా జీవితంలో ఒక అడుగు ముందుకు వేశాను.. అలాంటప్పుడు వెనక్కి ఎందుకు వెళ్తాను?" అని సూటిగా ప్రశ్నించారు. బాబు విహాన్ పుట్టిన క్షణాలు తమ జీవితంలో ఎంతో మధురమైనవని, తన శరీరానికి సరిపడే ఫిట్‌నెస్‌ను తన సొంత వేగంలో సాధిస్తానని ఆమె స్పష్టం చేశారు. మహిళలపై పెరిగిన అందాల ఒత్తిడి: ఇటీవల విక్టోరియా సీక్రెట్ షోలలో లేదా సెలబ్రిటీల ప్రసవానంతర రూపాలపై సోషల్ మీడియాలో జరుగుతున్న చర్చలను కత్రినా తీవ్రంగా ఖండించారు. నాఓమి వోల్ఫ్ రాసిన 'ది బ్యూటీ మిత్' పుస్తకంలో చెప్పినట్లుగా, మహిళల సహజ మార్పులను తప్పుగా చిత్రీకరించడం సరికాదని ఆమె అభిప్రాయపడ్డారు. ఇక తన శరీరాన్ని గౌరవిస్తూ, ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గకుండా తన స్వంత శైలిలో ముందుకెళ్తానని కత్రినా చెప్పడం విశేషం. బిజినెస్ అండ్ మదర్‌హుడ్ బ్యాలెన్స్: ఒకవైపు నటన, మరోవైపు తన సొంత బ్యూటీ బ్రాండ్ 'కే బ్యూటీ' వ్యాపార బాధ్యతలను చూసుకుంటూనే, మరోవైపు తల్లిగా కొత్త ప్రయాణాన్ని సమర్థవంతంగా ఆస్వాదిస్తున్నట్లు కత్రినా పేర్కొన్నారు.

తరుణ్ భాస్కర్.. నెక్ట్స్ ఆ హీరో దగ్గరికేనా!

వెంకటేష్‌తో 'దెక్కన్ డెర్బీ' సినిమా చేయాలని 2019లోనే తరుణ్ భాస్కర్ ప్రయత్నించారు. కథ సురేష్ బాబుకు నచ్చినా, సెకండాఫ్‌పై సంతృప్తి లేకపోవడంతో ప్రాజెక్ట్ ఆగిపోయింది. స్క్రిప్ట్‌లో మార్పులు చేస్తున్నానని, కథను పక్కనపెట్టలేదని తరుణ్ గతంలోనే స్పష్టం చేశారు. నవంబర్ 19న 'ఈ నగరానికి ఏమైంది రిపీట్' విడుదల కానుంది. ఈ సినిమా ఫలితం తర్వాత వెంకీ ప్రాజెక్ట్‌పై ఆసక్తి నెలకొంది. తరుణ్ భాస్కర్‌కు విక్టరీ వెంకటేష్‌తో సినిమా చేసే అవకాశం ఎప్పుడో వచ్చింది. కథ కూడా సిద్ధం చేసుకున్నారు. కానీ ఆ ప్రాజెక్ట్ షూటింగ్ వరకు వెళ్లకుండా ఆగిపోయింది. అప్పటినుంచి వెంకీతో సినిమా ఎప్పుడు ఉంటుందని తరుణ్‌కు పలుమార్లు ప్రశ్నలు ఎదురయ్యాయి. ఇప్పుడు 'ఈ నగరానికి ఏమైంది రిపీట్' విడుదలకు సిద్ధమైంది. ఈ సినిమాతో మంచి హిట్ అందుకుని మళ్లీ వెంకటేష్ ప్రాజెక్ట్‌పైకి వెళ్తారా అనే ఆసక్తి ఉంది. వెంకటేష్ కోసం తరుణ్ సిద్ధం చేసిన కథ పేరు 'దెక్కన్ డెర్బీ'. హైదరాబాద్‌లో గుర్రపు పందేలు, బెట్టింగ్ నేపథ్యంలో ఈ సినిమా చేయాలనుకున్నారు. 2019లోనే ప్రయత్నాలు మొదలయ్యాయి. సురేష్ బాబుకు కూడా కథ నచ్చింది. అయితే సెకండాఫ్ విషయంలో తరుణ్ సంతృప్తి చెందకపోవడంతో ప్రాజెక్ట్ ఆగిపోయింది. భారీ బడ్జెట్, టెక్నికల్ వర్క్ అవసరమవడం కూడా ఆలస్యానికి కారణమైంది. తరుణ్ కెరీర్ చూస్తే 'పెళ్లిచూపులు'తో మంచి విజయం అందుకున్నారు. ఆ తర్వాత 'ఈ నగరానికి ఏమైంది'తో యూత్‌లో ప్రత్యేకమైన క్రేజ్ సంపాదించారు. 2023లో 'కీడా కోలా'తో క్రైమ్ కామెడీ ప్రయత్నించారు. కానీ ఆ సినిమా ఆశించిన స్థాయిలో కమర్షియల్ హిట్ కాలేదు. మధ్యలో నటుడిగానూ పలు సినిమాలు చేసిన తరుణ్, దర్శకుడిగా మరో పెద్ద విజయాన్ని అందుకోవాలని చూస్తున్నారు. ఈసారి తనకు మంచి గుర్తింపు తెచ్చిన నలుగురు స్నేహితుల కథనే కొనసాగిస్తున్నారు. అయితే మొదటి భాగంలో షార్ట్ ఫిల్మ్ తీయాలనుకున్న గ్యాంగ్, ఇప్పుడు పూర్తిస్థాయి సినిమా చేయడానికి ప్రయత్నిస్తోంది. పాత పాత్రలతో కొత్త సమస్యలను చూపించబోతున్నారు. ముఖ్యంగా అభినవ్ గోమటం కామెడీ, విశ్వక్ సేన్ పాత్రపై ప్రేక్షకులకు ఇప్పటికే మంచి అంచనాలున్నాయి. మరోవైపు వెంకటేష్‌తో సినిమా విషయంలో తరుణ్ గత జనవరిలోనే క్లారిటీ ఇచ్చారు. స్క్రిప్ట్‌లో మార్పులు చేస్తున్నానని, కథ ఇప్పటికీ పనికొస్తుందని చెప్పారు. ప్రాజెక్ట్ ఆగడానికి వెంకటేష్ కారణం కాదని, తానే మరింత వర్క్ చేయాల్సి ఉందని వివరించారు. అంటే కథను పూర్తిగా పక్కనపెట్టలేదు. అయితే వెంకీ నుంచి మళ్లీ డేట్స్ తీసుకోవాలంటే ముందు స్క్రిప్ట్ సిద్ధం కావాలి. నవంబర్ 19న 'ఈ నగరానికి ఏమైంది రిపీట్' విడుదల కానుంది. విశ్వక్ సేన్, అభినవ్ గోమటం, వెంకటేష్ కాకుమాను నటిస్తుండగా, కార్తీక్ పాత్రలో ఈసారి శ్రీనాథ్ మాగంటి కనిపించనున్నారు. వివేక్ సాగర్ సంగీతం అందిస్తున్నారు. ఈ సీక్వెల్ మంచి విజయం సాధిస్తే తరుణ్‌కు స్టార్ హీరోలతో సినిమా చేసే అవకాశాలు మరింత మెరుగుపడొచ్చు.



అన్ని పుకార్లకు చెక్.. 'దాదా' ఫిక్సయితే దబిడి దిబిడే!

నందమూరి బాలకృష్ణ, గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'దాదా' విడుదల తేదీపై చిత్రబృందం క్లారిటీ ఇచ్చింది. డిసెంబర్ 24న క్రిస్మస్ కానుకగా సినిమా విడుదల కానుంది. ఇందులో బాలయ్యను రొటీన్ మాస్ హీరోగా కాకుండా మెచ్యూర్డ్ మాఫియా డాన్‌గా చూపిస్తారా అన్న ఆసక్తి నెలకొంది. థమన్ సంగీతం అందిస్తుండగా, కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తోంది. ప్రస్తుతం ఎడిటింగ్, డబ్బింగ్ పనులు వేగంగా జరుగుతున్నాయి. నటసింహం నందమూరి బాలకృష్ణ ఆలోచనల్లో వేగం, సినిమా పట్ల ఆయనకున్న అంకితభావం చూస్తుంటే సినీ పండితులు సైతం ఆశ్చర్యపోవాల్సిందే. ఇటీవల ఎదురైన చిన్నపాటి గాయాల్ని సైతం లెక్క చేయకుండా, అత్యంత ప్రణాళికా బద్ధంగా షూటింగ్ పూర్తి చేసి.. అనుకున్న సమయానికే దాదా చిత్రాన్ని రిలీజ్ చేయించేలా, తన తదుపరి పనుల్లో మునిగిపోయారు బాలయ్య. సోషల్ మీడియాల్లో -దాదా- విడుదల వాయిదా పడుతోందంటూ వచ్చిన అనవసర పుకార్లన్నింటికీ చిత్రబృందం కొట్టిపారేస్తూ క్లారిటీ ఇచ్చేసింది. సినిమా విడుదల వాయిదా ప్రసక్తే లేదని.. చెప్పిన టైముకే అంటే డిసెంబర్ 24న క్రిస్మస్ కానుకగా నటసింహం థియేటర్ల బరిలోకి దిగుతున్నారని ధీమా వ్యక్తం చేసింది. బాలయ్య కమిట్‌మెంట్‌తో పెట్టుకుంటే నిజంగా దబిడి దిబిడే అని మరోసారి ప్రూవ్ కాబోతోందిట. 5 అయితే ఈ గ్రాండ్ రిలీజ్ అప్‌డేట్ ఎంత సంతోషాన్ని ఇస్తుందో.. మరోవైపు అభిమానుల్లో ఒక ఆసక్తికరమైన చర్చకు తెరలేపింది. దర్శకుడు గోపీచంద్ మలినేని బాలకృష్ణను ఇందులో ఎలా చూపించబోతున్నారనేది ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఇటీవలి కాలంలో శివ నిర్వాణ -ఇరుముడి-లో మాస్ మహారాజా అంతటివాడినే ఎంతో షటిల్డ్‌గా, పరిణతి చెందిన ప్రశాంతమైన పాత్రలో ఆవిష్కరించిన తీరు అందరినీ ఆకట్టుకుంది. మరి అదే బాటలో గోపీచంద్ మలినేని కూడా బాలయ్యను కేవలం ఒక రొటీన్ మాస్ హీరోగా కాకుండా.. క్యారెక్టర్ డెప్త్ ఉన్న పవర్ ఫుల్ మెచ్యూర్డ్ లుక్‌లో చూపిస్తాడా? లేక తన మార్కు రొటీన్ అవుట్ అండ్ అవుట్ మాస్ ఫార్ములాకే పరిమితమవుతాడా? అనే సందేహాల్ని లేవనెత్తుతున్నారు. ప్రస్తుత పాన్-ఇండియా సినీ ప్రేక్షకుల ఆలోచనా విధానం అసాధారణంగా మారింది. ఎంతటి గ్యాంగ్‌స్టర్ డ్రామా అయినా లేదా ముంబై మాఫియా బ్యాక్‌డ్రాప్ కథ అయినా.. అందులో లౌడ్ యాక్షన్ కంటే కథలోని గాంభీర్యం, పాత్రలోని ఔచిత్యం ముఖ్యం. అతిశయోక్తులు, లాజిక్‌కు అందని ఫైట్లు లేకుండా ప్రస్తుత ఆడియెన్స్ మైండ్ సెట్‌కి తగినట్లుగా రియలిస్టిక్ యాక్షన్ స్టంట్స్‌తో బాలయ్య పాత్రను డిజైన్ చేసి ఉంటారని కూడా భావిస్తున్నారు. బాలయ్యలోని నట విశ్వరూపాన్ని సద్వినియోగం చేస్తూనే ఆయన వయసుకు తగిన గాంభీర్యాన్ని జోడించిన మాఫియా డాన్ పాత్రలో చూపిస్తున్నారా? పాన్-ఇండియన్ ఆడియన్ మనసుల్ని నేరుగా తాకే పాత్రగా ఇది చరిత్రలో నిలిచిపోతుందా? అంటూ ఎవరికి వారు ఊహాగానాలు సాగిస్తున్నారు.



సినిమా సాంకేతిక అంశాలు భేషుగ్గా ఉండేందుకు టీమ్ కృషి చేస్తోంది. నిర్మాణ పురోగతి కూడా అంతే వేగంగా సాగుతోంది. దర్శకుడు గోపీచంద్ మలినేని నేతృత్వంలో ఎడిటింగ్, డబ్బింగ్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతుండగా.. మ్యూజిక్ సెన్సేషన్ ఎస్.థమన్ ఈ చిత్రానికి మైండ్ బ్లోయింగ్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందించే పనిలో ఉన్నారు. కాజల్ అగర్వాల్ కథానాయికగా అలరించనుండగా.. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా ఈ భారీ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నారు. ఇప్పటికే నాన్-థియేట్రికల్ రైట్స్ భారీ ధరలకు అమ్ముడవగా.. థియేట్రికల్ బిజినెస్ క్లోజింగ్ స్టేజ్‌కు చేరుకుంది. క్రిస్మస్ రేసులో -దాదా- రాక ఖరారు కావడంతో డిసెంబర్ బాక్సాఫీస్ వద్ద బాలయ్య మాస్ జాతర ఖాయంగా కనిపిస్తోంది. అయితే పక్కా కమర్షియల్ ఎలిమెంట్స్‌తో పాటు ఆధునిక ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టుగా బాలకృష్ణను ఒక కొత్త కోణంలో పవర్‌ఫుల్ అండ్ మెచ్యూర్డ్ గ్యాంగ్‌స్టర్‌గా గోపీచంద్ మలినేని ప్రెజెంట్ చేస్తే మాత్రం థియేటర్లలో రికార్డుల వేట మొదలైనట్లేననే విశ్లేషణ సాగుతోంది. ఎన్బీకేని కింగ్ ఆఫ్ కయాస్ గా చూడాలని అభిమానులు ఆరాటపడుతున్నారు. ఆ మేరకు అంచనాలు పెరిగిపోతున్నాయి. ఇకపై వరుస అప్‌డేట్స్‌తో రాబోతున్న -దాదా- ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో చూడాలి.

ఇదేమి కన్ఫ్యూజన్ నాని.. అది ఇది కాదు.. అదే ఇది..!

నేచురల్ స్టార్ నాని సినిమాల బాక్సాఫీస్ పరిస్థితి ఇప్పుడు అయోమయంగా మారింది. శ్యామ్ సింగరాయ్, అంటే సుందరానికి, హాయ్ నాన్న సినిమాలు ప్రశంసలు అందుకున్నా భారీ వసూళ్లు సాధించలేకపోయాయి. దసరా మంచి విజయాన్ని అందించగా, సరిపోదా శనివారం, ది ప్యారడైజ్ కలెక్షన్ల పరంగా పర్వాలేదనిపించాయి. విమర్శకుల ప్రశంసలతో పాటు భారీ వసూళ్లు తెచ్చే ఒక్క బ్లాక్‌బస్టర్ నానికి అవసరమనే చర్చ జరుగుతోంది. టాలీవుడ్‌లో నేచురల్ స్టార్ నాని అంటే ప్రేక్షకుల్లో ప్రత్యేకమైన అభిమానం ఉంది. సహజమైన నటన, సింపుల్‌గా ఉండే వ్యక్తిత్వం, ఫ్యామిలీ ఆడియన్స్‌కు దగ్గరయ్యే సినిమాలతో నాని తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. అయితే ఆయన సినిమాల బాక్సాఫీస్ పరిస్థితి మాత్రం ఇప్పుడు కొంత అయోమయంగా మారింది. సినిమాలు బాగున్నా కలెక్షన్లు రావడం లేదు. కలెక్షన్లు వచ్చినా సినిమాలకు ఆశించిన స్థాయిలో పేరు రావడం లేదు. శ్యామ్ సింగరాయ్ నుంచి చూస్తే నాని సినిమాల పరిస్థితి ఇదే విధంగా కనిపిస్తోంది. ఈ సినిమా కథ, నటన, భావోద్వేగ సన్నివేశాలతో ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంది. కానీ బాక్సాఫీస్ దగ్గర మాత్రం ఆశించిన స్థాయిలో వసూళ్లు రాలేదు. ఇక అంటే సుందరానికి సినిమా గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. విడుదల సమయంలో ఈ సినిమాకు మంచి టాక్ వచ్చినా కలెక్షన్లు మాత్రం నిరాశపరిచాయి. ఆ తర్వాత ఓటీటీలో మంచి ఆదరణ దక్కించుకుంది. చాలామంది ఈ సినిమాను కల్ట్ క్లాసిక్‌గా కూడా భావిస్తున్నారు. కానీ థియేటర్లలో మాత్రం నిర్మాతలు, బయ్యర్లకు ఆశించిన ఫలితం దక్కలేదు. హాయ్ నాన్న కూడా మంచి ప్రశంసలు అందుకున్న సినిమా. తండ్రి, కూతురు మధ్య అనుబంధాన్ని చూపించిన ఈ చిత్రం ఫ్యామిలీ ఆడియన్స్‌కు బాగా కనెక్ట్ అయింది. అయినప్పటికీ భారీ బ్లాక్‌బస్టర్‌గా నిలవలేకపోయింది. మరోవైపు దసరా సినిమా నానికి మంచి విజయాన్ని అందించింది. తెలంగాణ నేపథ్యం, మాస్ పాత్ర, కథలోని తీవ్రత ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. అయితే ఈ సినిమాపై కూడా కొన్ని వర్గాల నుంచి విమర్శలు వచ్చాయి. సరిపోదా శనివారం మిక్స్‌డ్ టాక్ వచ్చినప్పటికీ మంచి వసూళ్లు సాధించింది. ఇక ది ప్యారడైజ్ సినిమాకి నెగిటివ్ టాక్ వచ్చినప్పటికీ



కలెక్షన్ల విషయంలో పర్వాలేదు అనిపించుకుంది. ఇలా నాని సినిమాల విషయంలో ఏది హిట్, ఏది ఫ్లాప్, ఏ సినిమా బయ్యర్లకు లాభాలు తెచ్చింది అనే అంశాలు కన్ఫ్యూజన్‌గా మారుతున్నాయి. మంచి సినిమాలు తీస్తున్నా ప్రతిసారీ భారీ లాభాలు రావడం లేదు. అలా అని ఏ సినిమా కూడా డిజాస్టర్ అవ్వడం లేదు. నాని క్రేజ్‌పై ఎలాంటి సందేహం లేదు. కానీ ఆయనకు ఇప్పుడు కావాల్సింది విమర్శకుల ప్రశంసలతో పాటు బాక్సాఫీస్ దగ్గర కూడా భారీ విజయాన్ని అందించే సినిమా. కలెక్షన్లు తెచ్చుకొని.. పేరు తెచ్చుకోకుండా.. లేకపోతే పేరు తెచ్చుకొని కలెక్షన్లు తెచ్చుకోకుండా.. ఇలాంటి అయోమయంలో ఉండే సినిమాలు కాకుండా.. ఏదైనా ఒక్క బ్లాక్ బస్టర్ సినిమా తీస్తే ఇక నాని లెవెల్ వేరే.

మొత్తానికి 'రామాయణ' నుంచి హనుమ ట్రీట్.. కానీ!

లేటెస్ట్ గా ఎన్నో అంచనాలు సెట్ చేసుకొని బిగ్ స్క్రీన్స్ పై అలరించేందుకు వచ్చిన లేటెస్ట్ సినిమానే 'రామాయణ'. రణబీర్ కపూర్ హీరోగా సాయి పల్లవి, యష్ లను స్టార్ నటీనటులు కలయికలో దర్శకుడు నితీష్ తివారి తెరకెక్కించిన ఈ సినిమా ఇప్పుడు బిగ్ స్క్రీన్స్ లో గ్రాండ్ ట్రీట్ అందిస్తుంది. అయితే ఈ సినిమా విషయంలో మొదటి నుంచి సస్పెన్స్ గా ఉంచిన అంశం ఏదన్నా ఉంది అంటే అది బాలీవుడ్ నటుడు సన్నీ డియోల్ పోషించిన హనుమ పాత్ర అనే చెప్పాలి.తెలుగు సినిమా వార్తలు తన లుక్ కి సంబంధించి చిన్న లీక్ కూడా బయటకి రాకుండా డైరెక్ట్ గా థియేటర్స్ లోనే తన ప్రెజెన్స్ ని మేకర్స్ రివీల్ చేసి మరింత కిక్ ఇచ్చారు. అయితే ఇక్కడ చిన్న ట్విస్ట్ ఏంటంటే మేకర్స్ పూర్తిగా సన్నీ డియోల్ లుక్ ని రివీల్ చేయలేదు. తన ముఖాన్ని మాత్రం చూపించకుండా తన పాత్ర ప్రభావం ఎలా ఉంటుంది అనేది పలు విజువల్స్ తో ప్రెజెంట్ చేసారు.



ముందు థియేటర్స్ లో ప్రదర్శన తర్వాత ఆన్లైన్ లో సాంగ్ గా అదే కంటెంట్ ని విడుదల చేశారు. ఇలా మొత్తానికి రెండో పార్ట్ లో సన్నీ డియోల్ పాత్ర పెద్ద ఎత్తున హైలైట్ కానుంది అని చెప్పవచ్చు

Edited, Printed, Published and Owned by Bavanari Ravi kumar. Printed at M/s Manikanta Enterprises, H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State.
Published at H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State. Editor: Bavanari Ravi Kumar. RNI No.TELTEL/2014/55197